



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | శుక్రవారం 23-4-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 219 | పేజీలు:4 | వెల: రూ.1/-


# ప్రపంచ ధరిత్రీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం కేసీఆర్

హైదరాబాద్ ఏప్రిల్ 22: ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అంటే..'మనం జన్మించిన భూమి స్వర్గం కంటే గొప్పది' అని రామాయణంలో వాల్మీకి మహర్షి చెప్పిన సూక్తిని మనం నివసిస్తున్న ప్రాంతం పట్ల అభిమానాన్ని పెంచుకొని, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి మనందరం ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరమున్నదన్నారు. మనం పుట్టిన ఊరు పట్టణం ఏదైనా, మనం నివసిస్తున్న ప్రాంతాన్ని కాలుష్యరహితంగా, పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచేందుకు కృషి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ప్రతి తెలంగాణ పౌరుడూ ప్రతినబూనాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు.

**ధరిత్రీ రక్షణ చర్యల్లో భాగంగా తెలంగాణకు హరితహారం**

ధరిత్రీ రక్షణ చర్యల్లో భాగంగా తెలంగాణను పచ్చగా మార్చేందుకు, రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న "తెలంగాణకు హరితహారం" కార్యక్రమం విజయవంతంగా నడుస్తున్నదని సీఎం తెలిపారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతిలో భాగంగా పరిశుభ్రత పచ్చదనం కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. తాగునీరు, సాగునీరు లేక కరువు కాటకాలతో అల్లాడిన తెలంగాణ నేలలో నేడు అడుగడుగునా జీవ జలం ప్రవహిస్తున్నదన్నారు. ప్రాజెక్టులు కట్టి, కాల్వలతో నదీ జలాలలను సుదూర ప్రాంతాలకు తెలంగాణ వ్యాప్తంగా పల్లె పల్లెకూ తరలించడం ద్వారా చెరువులు కుంటలు నిండి భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగాయన్నారు. తద్వారా పంటలకు, మనుషులకే కాకుండా పశు పక్షాదులకు మేలుజరిగి తెలంగాణ నేలమీద ప్రకృతి సమతుల్యత సాధించగలిగామని తెలిపారు. నేడు తెలంగాణ అంతటా జల లభ్యత పెరగడంతో పచ్చదనం పరిఢవిల్లుతూ వాతావరణం చల్లబడడం వంటి గుణాత్మక మార్పులకు చోటుచేసుకుంటున్నాయన్నారు. పక్షులు తిరిగి చెరువులను కుంటలను ఆశ్రయిస్తూ చెట్లమీద వాలుతూ కిలకిలారావాలతో తిరిగి ప్రాణం పోసుకుంటున్నాయని తద్వారా జీవవరణాన్ని తిరిగి తెలంగాణలో సాధించగలిగామన్నారు.

తెలంగాణ స్వరాష్ట్రాన్ని సాధించిన నాటినుంచి ప్రభుత్వం చేపడుతున్న అనేక చర్యలు ఈ భూగోళంలో భాగమైన తెలంగాణ ప్రాంతాన్ని సుభిక్షంగా మార్చేందుకు దోహదపడ్డాయని సిఎం వివరించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ప్రకృతి పర్యావరణం పట్ల నిర్లిప్తంగా వుండిపోయిన తెలంగాణ ప్రజలకు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల మూలంగా పరిశుభ్రత పచ్చదనం నీటివినియోగం తోపాటు ప్రకృతి వనరుల పరిరక్షణపై తద్వారా ధరిత్రి రక్షణపై అవగాహన పెరగడం శుభ సూచకమని సిఎం అన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

విశ్వవ్యాప్తంగా రోజు రోజుకూ తలెత్తుతున్న వాతావరణ మార్పులు తద్వారా మానవ జాతికి కలుగుతున్న కీడు మనిషి స్వయంకృపారాధమనే విషయాన్ని అందరమూ ఇప్పటికైనా గ్రహించాలన్నారు. కరోనా వంటి మహమ్మారీ రోగాలతో ధరిత్రికి పొంచిఉన్న ప్రమాదాలపై అవగాహన పెంచుకొని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన పిల్లలకోసం కేవలం డబ్బు సంపాయించడం ఆస్తులు కూడబెట్టడం మాత్రమే మనం చేయాల్సిన పనికాదన్నారు. ధరిత్రి సంరక్షణ పట్ల మనం ఎంత బాధ్యతగా వ్యవహరిస్తే.. భవిష్యత్తు తరాలకు మనం అంత ఆనందం పంచినవాల్లమౌతామని, గుణాత్మక జీవనాన్ని అందించినవారమౌతామని సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు ధరిత్రీ దినోత్సవం సందర్భంగా పిలుపునిచ్చారు.

# ఎన్నికలు రద్దు పిటీషన్.. తోసిపుచ్చిన హైకోర్టు

హైదరాబాద్ ఏప్రిల్ 22: తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలు రద్దు చేయాలని హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్‌లో లంచ్ మోషన్ పిటీషన్ దాఖలైంది. కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కరోనా కేసులు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ఎన్నికలు వాయిదా వేయాలని షబ్బీర్ అలీ కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నైట్ కర్ఫ్యూను అమలు చేసిందని, ఈ సమయంలో ఎన్నికలు నిర్వహించకుండా ఆదేశాలు ఇవ్వాలని పిటీషనర్ కోరారు.

అయితే, లంచ్ మోషన్ పిటిషన్‌ను విచారించేందుకు చీఫ్ జస్టిస్ హిమా కోహ్లీ నిరాకరించారు. ఎన్నికల కమిషన్‌కు మరోసారి విన్నవించాలని పిటిషనర్‌కు చీఫ్ జస్టిస్ సూచించారు. ఇప్పటికే హైకోర్టు సింగిల్ బెంచ్ ఎన్నికలను ఆపలేమని చెప్పడంతో డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. అయితే లంచ్ మోషన్ అనుమతి ఇవ్వకపోవడంతో రెగ్యులర్ పిటీషన్‌ను షబ్బీర్ అలీ వేయనున్నారు.

# ప్రయాణాలు వాయిదా వేసుకోండి - ప్రజలకు మంత్రి ఈటల సూచన



ఉధృతి దృష్ట్యా సాధారణ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అత్యవసమైతే తప్ప ఒక చోట నుంచి మరో చోటికి ప్రయాణం చేయవద్దని అన్నారు.. హైదరాబాద్ లోని ఆయన మంత్రిత్వ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, కరోనా సెకండ్ వేవ్ తీవ్రత గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లో కరోనా తీవ్రత అధికంగా ఉందన్నారు. మున్సిపాలిటీల పరిధిలో ఆ శాఖ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో కఠిన చర్యలు తీసుకుం టున్నట్టు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేదని, అయితే ముందు జాగ్రత్త చర్యగా ప్రజలందరూ ఇళ్లలోనే ఉండాలని కోరారు..ఇక మహారాష్ట్రకు అనుకొని ఉన్న తెలంగాణ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ప్రభుత్వ సూచనలను పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించా లని కోరారు. ఏ ఆపదొచ్చినా తెల ంగాణ ప్రజలను ప్రభుత్వం ఆదుకుం టుందని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలను నమ్మి ఎవరూ భయాందోళనకు గురికావొద్దని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో రెమిడెసివర్, ఆక్సిజన్, బెడ్ల కొరత లేదని స్పష్టం చేశారు

# మెగాస్టార్ ను ప్రశంసించిన గవర్నర్



హైదరాబాద్ ఏప్రిల్ 22: టాలీవుడ్ సినీ కార్మికుల కోసం ఏర్పాటైన కరోనా క్రైసిస్ ఛారిటీ (సీసీసీ) సంస్థ తరఫున 45 ఏళ్లకు పైబడిన సినీ కార్మికులకు, సినీ జర్నలిస్టులకు ఉచితం వ్యాక్సిన్లను అందిస్తామని మెగాస్టార్ చిరంజీవి ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఆయనపై తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రశంసల జల్లు కురిపించారు.

అపోలో సహకారంతో సినీ కార్మికులు, జర్నలిస్టులకు ఉచితంగా వ్యాక్సిన్ వేయిస్తామని చిరంజీవి ప్రకటన చేయడం గురించి తెలుసుకుని సంతోషించానని చెప్పారు. సమాజం పట్ల ఆయన చూపిస్తోన్న బాధ్యత ప్రశంసనీయమని చెప్పారు.

తమిళిసై చేసిన ట్వీట్ కు చిరంజీవి స్పందించారు. 'గవర్నర్ తమిళిసై మేడమ్ గారికి సీసీసీ తరఫున కృతజ్ఞతలు. సీసీసీ ద్వారా సాయం చేస్తోన్న వారందరికీ మీ ప్రశంసలు ప్రోత్సాహాన్ని అందిస్తాయి' అని ట్విట్టర్ లో పేర్కొన్నారు.

# సీఎం కేసీఆర్ గొప్ప దైవభక్తుడు : మంత్రి కొప్పుల



హైదరాబాద్ ఏప్రిల్ 22: సీఎం కేసీఆర్ గొప్ప దైవభక్తుడని, ఉమ్మడి రాష్ట్రంలో నిరాధరణకు గురైన మన ఆలయాలను గొప్పగా అభివృద్ధి చేస్తున్నారని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగిత్యాలలోని ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధిపై మంత్రి హైదరాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ యాదాద్రిని దివ్య క్షేత్రంగా తీర్చిదిద్దుతున్నారని, వేములవాడ, ధర్మపురి దేవస్థానాలను కూడా గొప్పగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేశారన్నారు.

ధర్మపురి లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులను భక్తి ప్రపత్తులు, శ్రద్ధాసక్తులతో చేపట్టి అద్భుతంగా తీర్చిదిద్దాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానం పునః నిర్మాణం, విస్తరణ, అభివృద్ధికి సీఎం రూ. 120కోట్లు కేటాయించగా ఇందులో మొదటి విడతగా రూ.61 కోట్ల 66లక్షలు విడుదలయ్యాయని వివరాలను వెల్లడించారు.

ఆలయం అభివృద్ధికి సంబంధించిన నమూన, ప్రతిపాదనలు, ప్రణాళిక, చేపట్టిన, చేపట్టాల్సిన చర్యల గురించి అధికారులు మంత్రికి వివరించారు.

సమావేశంలో దేవాదాయ శాఖ ఈఈ రాజేష్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, డీఈ రఘునందన్, అసిస్టెంట్ స్థపతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కనీసం ఆక్సిజన్‌ను అందుబాటులో ఉంచండి: ప్రశాంత్ కిశోర్

ఢిల్లీ, ఏప్రిల్ 22:: కొవిడ్ రోగులకు కనీసం ఆక్సిజన్‌ను అందుబాటులో ఉంచాల్సిందిగా కోరుతూ పోల్ స్ట్రాటజిస్ట్ ప్రశాంత్ కిశోర్ ప్రధానమంత్రి నరేంద్రమోదీని ట్వీట్ చేస్తూ కోరారు. కరోనా సెకండ్ వేవ్‌లో వేలాది మంది ఆక్సిజన్ సౌకర్యం అందుబాటులో లేక ప్రాణాలు కోల్పోతుండటాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. పరిస్థితులను అదుపులో ఉంచేందుకు కనీసం ఆక్సిజన్‌నైనా అందుబాటులో ఉంచాలన్నారు.

ఆస్పత్రుల్లో ఆక్సిజన్ అందుబాటు అంశంలో ఢిల్లీ హైకోర్టు స్పందిస్తూ.. అడుక్కోండి.. అప్పుతెచ్చుకోండి, దొంగిలించండి.. కానీ ఇది మీ బాధ్యత.. పౌరుడు ప్రభుత్వాలపై తిరగబడొచ్చని కేంద్రానికి సూచించిన అంశాన్ని ఆయన ఈ సందర్భంగా జోడించారు. మంగళవారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ ఆక్సిజన్ డిమాండ్ విషయాన్ని అంగీకరించారు. వీలైనంత త్వరగా అందుబాటులోకి వచ్చేలా కేంద్రం, రాష్ట్రాలు, ప్రైవేటు సంస్థలు తీవ్రంగా కృషి చేస్తున్నాయని తెలిపారు.

ఆక్సిజన్ లేమితో జరిగిన ప్రాణనష్టంపై ప్రధాని సంతాపం వ్యక్తం చేశారు. కొవిడ్ రోగులకు ఆక్సిజన్ కొరత అతి పెద్ద ఆందోళనగా మారిందన్నారు. అయితే ఆక్సిజన్ సరఫరాపై రౌండ్-ది-క్లాక్ పర్యవేక్షణకు ప్రభుత్వం హామీ ఇస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ స్పందిస్తూ ఊదరగొట్టే ప్రసంగాల కోసం కాకుండా దేశం పరిష్కారాల కోసం ఎదురు చూస్తోందని పేర్కొన్నారు.

# ఇద్దరు గూండాలకు పశ్చిమ బెంగాల్‌ను వదలను : మమతా బెనర్జీ

దక్షిణాది దినజ్‌పూర్, ఏప్రిల్ 22: ఢిల్లీకి చెందిన ఇద్దరు గూండాలకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రాన్ని వదలను అని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. దక్షిణ దీనాజ్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభ ర్యాలీలో మమతా బెనర్జీ ప్రసంగించారు. నేను ఆటగాడిని కానప్పటికీ ఎలా ఆడాలో మాత్రం నాకు తెలుసునని, ఇటీవలి కాలం వరకు లోక్‌సభలో ఉత్తమ ఆటగాడినని చెప్పారు. బెంగాల్‌ను ఢిల్లీకి చెందిన ఇద్దరు గూండాలకు అప్పగించలేదని కుండబద్దలు కొట్టారు.

పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్, సమీప ప్రత్యర్థి భారతీయ జనతా పార్టీల మధ్య అధికారాన్ని పొందాలని పోరు జరుగుతున్నట్లుగా కనిపిస్తున్నది. బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో సమావేశాలు నిర్వహిస్తుండగా.. దీదీ మాత్రం తానే అన్నీ అయి కార్యకర్తలకు మార్గదర్శనం చేస్తున్నారు.

ఎనిమిది దశల పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి ఐదు దశలు పూర్తయ్యాయి. ఏడవ, ఎనిమిదవ దశ పోలింగ్ ఏప్రిల్ 26, 29 న జరుగనున్నది. ఓట్ల లెక్కింపు మే 2 న నిర్వహించనున్నారు.కొవిడ్ వ్యాప్తి భయాందోళనలు ఉన్నప్పటికీ మమతా బెనర్జీ నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన కార్యకర్తలు ఎలాటి భౌతిక దూర నిబంధనలను పాటించకపోవడం కనిపించింది. పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 10,784 తాజా కొవిడ్-19 కేసులు నమోదయ్యాయి. వీటితో రాష్ట్రంలో కేసుల సంఖ్య 6,88,956 కు చేరిందని ఆరోగ్య శాఖ బుధవారం తెలిపింది.

# మంత్రి హరీశ్‌రావు సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరిన టీడీపీ నేతలు

సిద్దిపేట, ఏప్రిల్ 22: : టీఆర్ఎస్‌లోకి జోరుగా వలసల పర్వం కొనసాగుతున్నది. తాజాగా సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు ఎల్లు రవీందర్ రెడ్డి 100 మంది అనుచరులతో మంత్రి హరీశ్ రావు సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సిద్దిపేట అభివృద్ధిపై ఓర్వలేని వాళ్లు ఓట్లు ఎట్లా అడుగుతారని సూటిగా ప్రశ్నించారు.

గతంలో సిద్దిపేటలో తాగునీటి సమస్య ఎంత తీవ్రస్థాయిలో ఉండేదో మీ అందరికీ తెలుసు. నేడు తాగునీటి సమస్యను పరిష్కరించి మీ ఇంటికి నల్లా నీళ్లను తీసుకొచ్చిన టీఆర్ఎస్‌ను ఆదరించాలన్నారు.

గతంలో ఏ గల్లీలో చూసిన ఖాళీ బిందెలతో మా ఆడపడుచులు మాకు ఎదురయ్యే వాళ్లు. మా గల్లీ లో ఒక బోరు వేయించాలని కోరేవారన్నారు. కాంగ్రెస్ వల్ల గానీ, బీజేపీ వాళ్లతో ఎలాంటి అభివృద్ధి సాధ్యం కాదన్నారు. కేవలం టీఆర్ఎస్ తో మాత్రమే అభివృద్ధి సాధ్యమన్నారు.

గతంలో సిద్దిపేటలో మోరీలు, పందులు, మురికివాడలు మాత్రమే కనబడేవి.

టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక మీరు ఎక్కడ చూసినా పరిశుభ్రమైన అద్దంలాంటి గల్లీలు కానవస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. గతంలో సిద్దిపేటకు పిల్లని ఇయ్యాలంటే భయపడేవారు. ఎక్కడ అమ్మాయితో నీళ్లు మోపిస్తారో..బోరింగు కొట్ట లేక తమ బిడ్డ చేతులు పోతాయని ఇచ్చేవారు కాదు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందన్నారు.

బీడీ కార్మికులను, వృద్ధులను టీఆర్ఎస్ ప్రభుత్వం కడుపులో పెట్టుకొని చూసుకుంటుందన్నారు. వైద్యరంగంలోను సిద్దిపేట దూసుకెళుందన్నారు. సిద్దిపేటలో సకల సౌకర్యాలతో 400 పడకల ప్రభుత్వ దవాఖాన ప్రైవేటుకు దీటుగా వైద్యం అందుతుందన్నారు.

# అమర్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్లు తాత్కాలికంగా నిలిపివేత

శ్రీనగర్, ఏప్రిల్ 22:: దేశంలో కరోనా సెకండ్ వేవ్ తీవ్రత నేపథ్యంలో పవిత్ర అమర్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్లను తాత్కాలికంగా నిలిపివేశారు. శ్రీ అమర్‌నాథ్‌జీ పుణ్యక్షేత్రం బోర్డు (ఎస్ఐఎస్‌బీ) ఈ మేరకు గురువారం ప్రకటించింది. "దేశంలో కరోనా పరిస్థితి నేపథ్యంలో అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవలసిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని, శ్రీ అమర్‌నాథ్‌జీ యాత్రకు రిజిస్ట్రేషన్లు తాత్కాలికంగా నిలిపివేశాం. కరోనా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. పరిస్థితి మెరుగుపడిన తర్వాత తిరిగి యాత్ర రిజిస్ట్రేషన్లు కొనసాగిస్తాం" అని తెలిపింది.దక్షిణ కశ్మీర్ హిమాయాల్లోని అమర్‌నాథ్ గుహకు భక్తులు వెళ్లేందుకు ప్రతి ఏటా గట్టి భద్రత మధ్య యాత్ర నిర్వహిస్తారు. బాల్తాల్ మార్గంలో జూన్ 28న, చందన్వారీ మార్గంలో ఆగస్ట్ 22న ప్రారంభమయ్యే యాత్ర కోసం ఈ నెల 1, 15 తేదీల నుంచిపేర్ల నమోదును ప్రారంభించారు. 37 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 446 బ్యాంక్ బ్రాంచ్‌లలో అడ్వాన్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు చెందిన 316 బ్రాంచ్‌లు, జమ్మూ కశ్మీర్ బ్యాంక్‌కు చెందిన 90 బ్రాంచ్‌లు, యస్ బ్యాంక్‌కు చెందిన 40 బ్రాంచుల ద్వారా భక్తులు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.అయితే దేశంలో కరోనా కేసుల ఉధృతి నేపథ్యంలో అమర్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్లను తాత్కాలికంగా నిలిపివేసినట్లు బోర్డు తెలిపింది.

## చరిత్రలో నేటినిజం



కం॥ గాయని కంఠము లో_నెల
కోయిల వలె పాడి మురిపము గూర్చెడి వనితన్
గాయని 'పండిత రామా
బాయి'ని నేడలచు చుంటి పరవశమొప్పన్ !!

(ఏప్రిల్ 23 గాయని పండిత రామాబాయి పుట్టినరోజు...)

-రాధశ్రీ

సెల్: 9494481210



# లాభం తీసుకోకుండానే వ్యాక్సిన్లు ఇస్తాం.. ఇండియాకు ఫైజర్ ఆఫర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:: భారత ప్రభుత్వానికి అమెరికా ఫార్మాసూటికల్ కంపెనీ ఫైజర్ మంచి ఆఫర్ ఇచ్చినట్లు ఆ సంస్థ అధికార ప్రతినిధి గురువారం వెల్లడించారు. లాభం తీసుకోకుండానే ప్రభుత్వానికి తమ కరోనా వ్యాక్సిన్లు సరఫరా చేస్తామని తెలిపారు. ఇండియా కోసం మాత్రమే లాభం చూసుకోని ధరను మేము ప్రతిపాదించాము. ప్రభుత్వ ఇమ్యునైజేషన్ ప్రక్రియలో భాగం కావాలన్నదే మా ఉద్దేశం.

దీనికి సంబంధించి ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతాయి అని ఫైజర్ అధికార ప్రతినిధి తెలిపారు.

ఇండియాలో అమెరికా వ్యాక్సిన్ల ధరలపై వచ్చిన కొన్ని వార్తలను ఖండిస్తూ సంస్థ ప్రకటన విడుదల చేసింది. ధనిక, మధ్య ఆదాయ, పేద దేశాలకు ఒక్కో విధంగా తమ వ్యాక్సిన్ల ధరలను నిర్ణయించినట్లు ఫైజర్ తెలిపింది. ప్రపంచంలో అందరికీ సమానంగా తమ కొవిడ్ వ్యాక్సిన్లు ఇవ్వాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. కేవలం ప్రభుత్వాలకే వ్యాక్సిన్లు సరఫరా చేయడం అనేది అందులో భాగమే అని చెప్పింది. ఇండియా విషయంలోనూ ఇదే అనుసరిస్తామని తెలిపింది.

కరోనా కేసులు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో ఇండియాలో విదేశీ వ్యాక్సిన్లకు అనుమతుల ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసిన విషయం తెలిసిందే. దీంతో అమెరికాకు చెందిన ఫైజర్‌తోపాటు మోడెర్నా, జాన్సన్ అండర్ జాన్సన్ ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయి. ప్రస్తుతం ఫైజర్ అమెరికాలో ఒక్కో వ్యాక్సిన్ డోసుకు 19.5 డాలర్లు, యూరప్‌లో 23 డాలర్లు వసూలు చేస్తోంది.

# తెలంగాణలో యథావిధిగా మున్సిపల్ ఎన్నికలు

హైదరాబాద్ ఏప్రిల్ 22: కరోనా ఉధృతి దృష్ట్యా రెండు కార్పొరేషన్లు, ఐదు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతాయా? లేదా? అన్న అంశంపై ఏర్పడిన గందరగోళానికి తెరపడింది. షెడ్యూల్ ప్రకారమే మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి స్పష్టం చేశారు. కొవిడ్ నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేస్తామని, అన్ని రకాల ముందు జాగ్రత్తలు తీసుకుంటామని ప్రభుత్వం ఎస్ఈసీకి స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అధికారులతో ఎస్ఈసీ చర్చించి.. ఎన్నికల ప్రక్రియ కొనసాగించాలని నిర్ణయించింది.ఈ సందర్భంగా ఎస్ఈసీ పార్థసారథి మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ కొనసాగించాలని.. రాష్ట్ర ప్రభుత్వం కోరిందని తెలిపారు. అధికారులతో చర్చించి ఎన్నికల ప్రక్రియ కొనసాగింపునకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కొవిడ్ నిబంధనలు విధిగా పాటించాలని పేర్కొన్నారు. రాత్రి 7 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు బహిరంగ సభలు, ర్యాలీలపై నిషేధం విధించినట్లు స్పష్టం చేశారు. పోలింగ్‌కు 72 గంటల ముందే ప్రచారం ఆపాలని ఆదేశించారు. దీంతో 27వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఎన్నికల ప్రచారం ముగియనుంది.

వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతో పాటు జడ్చర్ల, కొత్తూరు, అచ్చంపేట, నకిరేకల్, సిద్దిపేట మున్సిపాలిటీలకు 30వ తేదీన పోలింగ్ జరగనుంది. మే 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# మౌలానా వహీదుద్దీన్ ఖాన్ గారి కన్నుమూత పట్ల సంతాపాన్ని వ్యక్తం చేసిన ప్రధాన మంత్రి

హైదరాబాద్ ఏప్రిల్ 22: మౌలానా వహీదుద్దీన్ ఖాన్ గారి కన్నుమూత పట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

"మౌలానా వహీదుద్దీన్ ఖాన్ గారి మరణ వార్త నాకు దు:ఖాన్ని కలిగించింది. ధర్మశాస్త్రం, ఆధ్యాత్మిక సంబంధి అంశాల పై మౌలానా వహీదుద్దీన్ ఖాన్ గారి కి? గల అంతర్ దృష్టి తో కూడినటువంటి జ్ఞానానికి గాను ఆయన ను స్మరించుకోవడం జరుగుతుంది. సాముదాయిక సేవ అన్నా, సామాజిక సాధికారిత అన్నా ఆయన కు ఎంతో మక్కువ. ఆయన కుటుంబానికి, అశేష సంఖ్య లో ఉన్న ఆయన శ్రేయోభిలాషుల కు ఇదే నా సంతాపం. మౌలానా వహీదుద్దీన్ ఖాన్ గారి ఆత్మ కు ఈశ్వరుడు శాంతి ని ప్రసాదించు గాక." అని ఒక ట్వీట్ లో శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

# వాతావరణంపై దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు (ఏప్రిల్ 22-23)

హైదరాబాద్ ఏప్రిల్ 22:వాతావరణంపై 2021 ఏప్రిల్ 22-23 తేదీల్లో ప్రత్యక్ష సాదృశ మార్గంలో నిర్వహించే దేశాధినేతల శిఖరాగ్ర సదస్సులో అమెరికా అధ్యక్షుడు జోసెఫ్ ఆర్.బైడెన్ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాల్గొంటారు. ఇందులో భాగంగా "2030 వైపు మన సమష్టి పయనం" ఇతివృత్తంగా 2021 ఏప్రిల్ 22న భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5:30 నుంచి రాత్రి 7:30 గంటలదాకా దేశాధినేతల మధ్య జరిగే తొలిదశ చర్చలో ప్రధానమంత్రి తన అభిప్రాయాలను వెల్లడిస్తారు.

ఈ శిఖరాగ్ర సదస్సులో దాదాపు మరో 40 మంది ప్రపంచ దేశాధినేతలు పాల్గొంటున్నారు. పలు దేశాల నేతలతోపాటు 'ప్రధాన ఆర్థిక వ్యవస్థల వేదిక'లో సభ్యత్వం (భారత్ సహా)గల, వాతావరణం మార్పుపరంగా దుర్బలమైన దేశాలకు వారు ప్రాతినిధ్యం వహిస్తారు. వాతావరణ మార్పుపై తమ అభిప్రాయాలను వారు పరస్పరం తెలియజేసుకుంటారు. అలాగే వాతావరణం పరంగా చేపట్టాల్సిన చర్యలు, వాతావరణ దుష్ప్రభావాల ఉపశమన చర్యలకు చొరవతోపాటు నిధుల సమీకరణ, ప్రకృతి ప్రాతిపదికగా పరిష్కారాలు, వాతావరణ భద్రతసహా పరిశుభ్ర ఇంధనం కోసం సాంకేతిక ఆవిష్కరణలపై వారు చర్చిస్తారు.

ఆయా దేశాల్లో జాతీయ పరిస్థితులు, సుస్థిర ప్రగతి ప్రాథమ్యాలను గౌరవిస్తూ- సార్వజనీన, ప్రతిస్పందనాత్మక ఆర్థికాభివృద్ధి చర్యలతో వాతావరణ మార్పుపై కార్యాచరణను ప్రపంచ దేశాలు సమన్వయం చేయడంపైనా నాయకులు చర్చిస్తారు. వాతావరణ సమస్యలపై 2021 నవంబరులో జరగబోయే 'కాప్26' మహాసభలకు సన్నాహకంగా సాగే అంతర్జాతీయ సమావేశాల పరంపరలో భాగంగా ఈ శిఖరాగ్ర సదస్సు నిర్వహించబడుతోంది. ఇందులో భాగంగా సాగే అన్ని దశల చర్చలూ అన్ని మాధ్యమాలకు, ప్రజలకు ప్రత్యక్ష ప్రసారం చేయబడతాయి.

# ట్యుటికోరిన్ పోర్టులో 300 కేజీలకుపైగా కొకైన్ స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ;



హైదరాబాద్ ఏప్రిల్ 22: ట్యుటికోరిన్ వీవోసీ నౌకాశ్రయానికి దిగుమతి అయిన సరుకులో కొకైన్ దాచి తీసుకొచ్చారన్న ప్రత్యేక నిఘా వర్గాల సమాచారంతో, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు, కలపతో కూడిన ఓ కంటైనర్‌లో తనిఖీలు జరిపారు. ఈ కంటైనర్ పనామా నుంచి ఆంట్వెర్ప్, కొలంబో మీదుగా ట్యుటికోరిన్ చేరింది.

ఈ కంటైనర్‌లో ఉన్న కలప మధ్య దాచిన 9 సంచులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివిధ పొరల మధ్య కట్టుదిట్టంగా చుట్టిన ఇటుకల వంటి 302 తెల్లటి అచ్చులు ఈ సంచుల్లో కనిపించాయి. వీటి బరువు 303 కేజీలు కాగా, వీటిని కొకైన్‌గా నిర్ధరించారు. ఎన్డీపీఎస్ చట్టం-1985 ప్రకారం, సరకుతోపాటు కంటైనర్‌ను కూడా అధికారులు జప్తు చేశారు. ఈ మాదక ద్రవ్యాల రవాణాపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుగుతోంది.

# సివిల్ సర్వీసెస్ డే నాడు సివిల్ సర్వెంట్‌లకు శుభాకాంక్షలుతెలిపిన ప్రధాన మంత్రి

హైదరాబాద్ ఏప్రిల్ 22: సివిల్ సర్వీసెస్ డే సందర్భం లో ప్రభుత్వ ఉద్యోగుల కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీ నరేంద్ర మోదీ ఒక ట్వీట్ లో ఈ కింది విధం గా పేర్కొన్నారు :

"సివిల్ సర్వీసెస్ డే సందర్భం లో ప్రభుత్వ ఉద్యోగులు అందరికీ ఇవే శుభాకాంక్ష లు. మన పౌరులకు సాయపడటానికి, దేశ ప్రగతి ని అధికం చేయడానికి వారు వివిధ రంగాల లో, వివిధ దుర్గమ స్థితుల లో అలుపెరుగక శ్రమిస్తున్నారు. వారు ఇదే ఉత్సాహం తో దేశ ప్రజల కు వారి సేవల ను అందిస్తూ ఉందురు గాక."

# పోలీస్ కమిషనర్ తరుణ్ జోషితో ఎన్నికల పరిశీలకురాలు చర్చలు?

వరంగల్, ఏప్రిల్ 22: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఎన్నికల అబ్జర్వర్ క్రిస్టీనా జెడ్ చోంగత్తును వరంగల్ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి గురువారం సర్క్యూట్ గెస్ట్ హౌజ్ లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న క్రమంలో పోలీసుల పరంగా చేపడుతున్న చర్యలు, తీసుకొంటున్న జాగ్రత్తలపై చర్చించారు. మున్సిపల్ ఎన్నికల పరిశీలకురాలుగా ప్రతి విషయాన్ని జాగ్రత్తగా గమనిస్తున్నట్టు అధికారులకు తెలిపారు . రాత్రి కర్ఫ్యూతో శాంతి,భద్రతలకు ఎలాంటి భంగం కలుగబోదన్న అవగాహనాకొచ్చినట్టు సమాచారం. కరోన కల్లోల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్రలపై కూడా ఇరువురు చర్చించినట్లు సమాచారం?



# ప్రపంచ సాహిత్య మహోన్నత శిఖరం షేక్స్‌పియర్

## (23 ఏప్రిల్ 'విలియమ్ షేక్స్‌ఫియర్ జయంతి మరియు వర్ధంతి' సందర్భంగా)

23 ఏప్రిల్ 1564న ఇంగ్లాండ్, స్టాన్ఫర్డ్‌లోని తోలు వ్యాపార కుటుంబంలో మేరీ ఆర్డన్ మరియు జాన్ షేక్స్‌ఫియర్ దంపతులకు జన్మించిన విలియమ్ షేక్స్‌ఫియర్ 26 ఏప్రిల్‌న బాప్టిజమ్ స్వీకరించారు. విలియమ్ షేర్స్‌ఫియర్ తల్లితండ్రులు మరియు సంతానం కూడా నిరక్షరాస్యులచే అయినప్పటికీ విలియమ్ షేక్స్‌ఫియర్ మాత్రమే ప్రపంచ ఆంగ్ల సాహిత్య చరిత్రలో చెరగని ముద్రను వేసిన ప్రఖ్యాత నాటక రచయిత, కవి మరియు రంగస్థల నటుడు. స్ట్రాట్‌ఫర్డ్ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. 'ఇంగ్లాండ్ జాతీయ కవి'గా పేరుగాంచిన షేక్స్‌ఫియర్ 39 నాటకాలు, 154 సోనెట్స్, మూడు దీర్ఘ కవితలు మరియు ఇతర రచనలు ఎన్నో చేశారు. వారు రచించిన అత్యద్భుత నాటకాలను అనేక ప్రపంచ భాషల్లోకి అనువదించారు. తన 18వ ఏట 26 ఏండ్ల వయస్సుగల 'అన్నే హాత్‌వే'ను వివాహమాడి ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చారు. ప్రథమ సంతానంగా 1583లో కూతురు 'సుసన్నా' మరియు 1585లో కవల పిల్లలు 'హామ్‌నెట్' మరియు 'జూడిత్'లు జన్మించారు. 1985 తరువాత 7 సంవత్సరాలు ఏమి చేశారో తెలియని (బహుశ ఉపాధ్యాయుడిగా లేదా వేటగాడిగా చేసి ఉండవచ్చుని) అజ్ఞాత చరిత్రను 'లాస్ట్ ఇయర్స్'గా రికార్డు చేశారు.

షేక్స్‌ఫియర్ ప్రముఖ రచనల్లో హామ్లెట్, రోమియో అండ్ జూలియట్, ఒథెల్లో, కింగ్ లియర్, కింగ్ జాన్, జూలియస్ సీజర్, క్వీన్ ఎలిజెబెత్, మర్చంట్ ఆఫ్ వెన్నిస్, 3 భాగాల హెన్రీ ?ఎ, కామెడీ ఆఫ్ ఎరర్స్, ది టెంపెస్ట్, మాక్‌బెత్ లాంటి అనేక సాహిత్య కళాఖండాలు ఉన్నాయి. నాటి సాంప్రదాయ కుటుంబ శైలికి దగ్గరగా ఉండేలా, నూతనత్వం మేళవించి, ప్రేమల నుండి యుద్ధాల వరకు ఆకర్షణీయంగా, వాస్తవానికి దగ్గరగా, తనదైన సరళ శైలిలో తన రచనలను చేశారు. విశ్వవిద్యాలయ విద్య చదవని విలియమ్ షేక్స్‌ఫియర్ తన జీవిత కాలంలో హాస్య, ప్రేమకథా, చారిత్రక, విషాద రచనలు ఎన్నో చేశారు. తన వ్యక్తిగత జీవితం గూర్చి స్పష్టమైన వివరాలు తెలియనప్పటికీ, ఆయన రచనల్లో మానవీయ భావోద్వేగాలు, సంఘర్షణలు గత నాలుగు శతాబ్దాలుగా కొనయాడబడుతున్నవి. విలియమ్ షేక్స్‌ఫియర్ ప్రపంచ ప్రఖ్యాత అత్యుత్తమ ఆంగ్ల సాహిత్యకారుడే అయినప్పటికీ, అతని జీవిత విశేషాలు సవివరంగా తెలియక పోవడం విచారకరం. తన జన్మదినం రోజున 52వ ఏట 23 ఏప్రిల్ 1616న తుది శ్వాస విడవడం జరిగింది. విలియమ్ షేక్స్‌ఫియర్ భౌతికంగా మన ముందు లేకపోయినా, తన నాణ్యమైన రచనలు కాలం ఉన్నంత వరకు మనల్ని నడిపిస్తూ, ఉల్లాస పరుస్తూ, జీవిత కష్ట సుఖాలను రుచి చూపిస్తూ, విశ్వ మానవాళికి మార్గదర్శకంగా ఉంటాయనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# వర్చువల్ విధానంలో సమావేశమైన ద్రవ్యాలు మరియు ఆహార పదార్థాల్లో వినియోగించే వస్తువులపై ఏర్పాటైన కోడెక్స్ కమిటీ సమావేశానికి ఆతిథ్యమిస్తున్న భారత్

హైదరాబాద్ ఏప్రిల్ 22:కోవిడ్ నేపథ్యంలో సురక్షిత ఆహారంతో పాటు నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) అధ్యక్షురాలు శ్రీమతి రీటా టీయోటియా అన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆహార పదార్థాల నాణ్యత, భద్రతల పరిరక్షణకు నియంత్రణ సంస్థలు మరింత అప్రమత్తంగా పనిచేయాలని ఆమె అన్నారు. కోడెక్స్ అలిమెంటారియస్ కమిషన్ (సిఏసి) కింద ఏర్పాటైన కోడెక్స్ కమిటీ ఆన్ స్పైసెస్ అండ్ క్యులినరీ హెర్బ్స్ (సిసిఎస్‌సిహెచ్) అయిదవ సమావేశం వర్చువల్ విధానంలో నిన్న జరిగింది. సమావేశాన్ని ప్రారంభించిన శ్రీమతి రీటా టీయోటియా సుగంధ ద్రవ్యాల ధర, ప్రాధాన్యత వల్ల వీటిని కల్తీ చేయడానికి, వీటికి ప్రత్యామ్నాయ మార్గాలను సూచించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 'ఆర్థిక ప్రయోజనాలను ఆశించి చేసే కల్తీ అత్యంత ప్రమాదకరమైన దుర్వినియోగం. ఇటువంటి సంఘటనలు జరగకుండా నిరోధించడానికి అత్యంత అప్రమత్తంగా పనిచేయవలసి ఉంటుంది, అంతర్జాతీయ విపణిలో సుగంధ ద్రవ్యాలకు నిర్దేశించిన ప్రమాణాలు లిఖితపూర్వకంగా వున్నాయి. ప్రపంచవ్యాపితంగా మార్కెట్ ఉన్న సుగంధ ద్రవ్యాలు,వంటల్లో ఉపయోగించే మూలికల భద్రత మరియు నాణ్యతను నిర్ధారించడానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఉంది.' అని ఆమె స్పష్టం చేశారు.

ఏప్రిల్ 20వ తేదీన ప్రారంభమైన సిసిఎస్‌సిహెచ్ సమావేశాలు 29వ తేదీ వరకు వర్చువల్ విధానంలో జరగనున్నాయి. ఈ సమావేశాల్లో 50 దేశాలకు చెందిన దాదాపు 300 మంది నిపుణులు పాల్గొనున్నారు. ప్రస్తుత సదస్సులో నిపుణులు పొడి అల్లం, లవంగాలు, కుంకుమ మరియు వంటల్లో ఉపయోగించే వాము, తులసిలను ఏడు దశల్లోను, జాజికాయ, మిరపకాయలు, మిరప పొడి ని నాలుగు దశల్లోనూ పరీక్షించి వీటి నాణ్యతా ప్రమాణాలను నిర్దేశిస్తుంది. ఇవికాకుండా ఏలకులు, పసుపు మరియు ఎండిన పళ్లు, కాయల రూపంలో లభించే సుగంధ ద్రవ్యాల నాణ్యతా ప్రమాణాలను నిర్దేశించే ప్రతిపాదనలు ఉన్నాయి.

సమావేశం మాట్లాడిన సుగంధ ద్రవ్యాల బోర్డు కార్యదర్శి శ్రీ డి. సతియన్ తాజా పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తొలిసారిగా ఆన్ లైన్ పద్దతిలో నిర్వహిస్తున్న సిసిఎస్‌సిహెచ్ సమావేశాలకు సభ్య దేశాల నుంచి స్పందన లభించిందని అన్నారు. అధిక సంఖ్యలో సుగంధ ద్రవ్యాలు మరియు వంటల్లో ఉపయోగించే మూలికలకు కమిటీ ర్యాంకులను ఇవ్వవలసి ఉందని అన్నారు. త్వరితగతిన పరిశీలన పూర్తి చేయడానికి వీటిని తరగతులుగా విభజించామని ఆయన తెలిపారు.

అలిమెంటారియస్ కమిషన్ అధ్యక్షుడు గిల్హెర్మ్ డా కోస్టా జూనియర్ మాట్లాడుతూ ఆహార భద్రతపై నియంత్రణ లేకపోవడం వల్ల తీవ్రమైన సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. నిఘా లోపం వల్ల ప్రతి సంవత్సరం వేలాది మంది ఆహార సంబంధిత వ్యాధులకు గురవుతూ మరణిస్తున్నారని అన్నారు. దీనివల్ల వివిధ దేశాలలో ఆర్థిక సంక్షోభంతో పాటు నిరుద్యోగం పెరుగుతున్నదని అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించి, ప్రతిచోటా, ప్రతిచోటా, ప్రతిఒక్కరికీ ఆహార భద్రత మరియు నాణ్యతను అందుబాటులోకి తీసుకుని రావడానికి కోడెక్స్ ప్రమాణాలను అభివృద్ధి చేసి అమలు చేయడానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వవలసిన అవసరం ఉందని అన్నారు.

భద్రత ప్రమాణాలను, లోపాలను గుర్తించడానికి పొలాల నుంచి ఇంటికి విధానాన్ని అమలు చేయవలసి ఉంటుందని భారతదేశంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రతినిధి డాక్టర్ రోడెరికో హెచ్. ఆఫ్రిన్ అన్నారు. ఆహార భద్రత, నాణ్యత, ప్రమాణాలను అమలు చేసే అంశానికి ఉత్పత్తిదారులు ఆహార నియంత్రణదారులు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కోవిడ్-19 నేపథ్యంలో ఆహార భద్రత, నాణ్యత మరియు సుస్థిరత ప్రమాణాలకు మరింత ప్రాధాన్యత ఇవ్వవలసి ఉంటుందని అన్నారు.

భారతదేశంలోని అసిస్టెంట్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) ప్రతినిధి కొండా చావ్వా మాట్లాడుతూ "ఆహార భద్రత మరియు సరసమైన వాణిజ్యాన్ని నిర్ధారించడానికి వివిధ దశలలో నిర్దిష్ట ప్రమాణాలను అమలు చేయడం మరియు సామర్థ్యాలను పెంపొందించడం ద్వారా ప్రమాణాలను మెరుగుపరచడానికి మరియు సమన్వయం చేయడానికి తమ సంస్థ ప్రయత్నిస్తున్నదని అన్నారు. ఉత్పత్తిదారులు మరియు వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడం మరియు సుగంధ ద్రవ్యాలు మరియు వంటల్లో ఉపయోగించే మూలికలకు ప్రపంచ నాణ్యతా ప్రమాణాలను నిర్ణయించడానికి సమావేశాలను నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు.

సుగంధ ద్రవ్యాలు మరియు వంటల్లో ఉపయోగించే మూలికల కోసం ప్రపంచవ్యాప్త ప్రమాణాలను అభివృద్ధి చేయడానికి మరియు విస్తరించడానికి మరియు ప్రమాణాల అభివృద్ధి ప్రక్రియలో ఇతర అంతర్జాతీయ సంస్థలతో చర్చలు జరపడానికి 2013 లో సిసిఎస్‌సిహెచ్ ఏర్పడింది. కమిటీ సమావేశాలను నిర్వహించడం కోసం వందకు పైగా దేశాల సహకారంతో భారతదేశం ఆతిథ్య దేశంగా మరియు సుగంధ ద్రవ్యాల బోర్డు భారతదేశం సచివాలయంగాను వ్యవహరిస్తున్నాయి. ప్రారంభమైనప్పటి నుండి సుగంధ ద్రవ్యాలు వంటల్లో ఉపయోగించే మూలికలకు ప్రపంచ ప్రమాణాలను రూపొందించడంలో కోడెక్స్ కమిటీ విజయం సాధించింది. ఇంతవరకు జరిగిన నాలుగు సెషన్లలో కమిటీ నాలుగు సుగంధ ద్రవ్యాలకు ప్రమాణాలను నిర్దేశించి ఖరారు చేసింది. ఎండిన లేదాపొడి రూపంలో వుండే నలుపు / తెలుపు / ఆకుపచ్చ మిరియాలు, జీలకర్ర, వాము మరియు వెల్లుల్లి ప్రమాణాలను కమిటీ నిర్దేశించింది. ఐక్యరాజ్యసమితి అనుబంధ ఆహార మరియు వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) మరియు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సంయుక్తంగా 1963 లో కోడెక్స్ అలిమెంటారియస్ కమిషన్ (సిఏసి)ను ఒక అంతర్-ప్రభుత్వ సంస్థగా ప్రారంభించాయి. వినియోగదారుల ఆరోగ్యాన్ని కాపాడటానికి ఆహార వాణిజ్యంలో న్యాయమైన పద్ధతులను అమలు జరిగేలా చూడడానికి సిఏసి కృషి చేస్తోంది.

# వినూత్నం..బస్ షెల్టర్‌గా పాడైన బస్సులు..



వికారాబాద్, ఏప్రిల్ 22: :జిల్లాలోని వికారాబాద్..తాండూరు బస్సు డిపోల అధికారులు వినూత్నంగా చేసిన ఆలోచన అందరిని ఆకట్టుకుంటోంది. ఆయా డిపోలలో పాడైన బస్సులను బస్ షెల్టర్‌లుగా వినియోగించుకుంటున్నారు. ఈ ఆలోచనకు సంస్థ ఉన్నతాధికారులు అభినందించడంతో పాటు ప్రయాణికుల నుంచి ప్రశంసలు కురుస్తున్నాయి. డిపో మేనేజర్ల వినూత్న ఆలోచనతో ఎర్రటి ఎండలో బస్సుల కొరకు వేచిచూస్తున్న ప్రయాణికులకు ఉపశమనం లభిస్తోంది.

మహారాష్ట్రలోని సూరత్ మహానగరంలో మూలకు చేరిన ఆర్టీసీ బస్సులకు గులాబి రంగు వేసి చూడముచ్చటగా తీర్చిదిద్ది మహిళా శౌచాలయాలుగా మార్చారు.

వాటిని నగరంలోని పలు ప్రాంతాలలో ఉంచి సేవలు అందిస్తున్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు వీటిని వినియోగిస్తున్నారు. అక్కడి అధికారులు చేసిన ఈ ఆలోచనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వచ్చాయి. ఈ ఆలోచనతో స్ఫూర్తి పొందిన ఇక్కడి ఆర్టీసీ అధికారులు కూడా విభిన్నంగా ముందుకు సాగారు. ప్రతి డిపోలో పెద్ద సంఖ్యలో పాడైన బస్సులు ఉన్నాయి. కాలం తీరిన ఈ బస్సులు చాలా కాలంగా డిపోలకు పరిమితం అవుతున్నాయి. ఈ బస్సులను ఎలా వినియోగించుకోవాలి అనే దానిపై ఆర్టీసీ యాజమాన్యం చాలా కాలంగా ఆలోచన చేస్తోంది.జిల్లాలో మొదటగా తాండూరు డిపో మేనేజర్ రాజశేఖర్ డిపోకు పరిమితం అయిన బస్సులను పట్టణ ప్రాంతంలోని వివిధ కూడళ్లలో బస్‌షెల్టర్‌గా వినియోగించడం ప్రారంభించారు. తాండూరులో గత వారం క్రితం చేసిన ఈ ప్రయోగం మంచి ఫలితాలను ఇచ్చింది. తాండూరు పట్టణంలోని ఇందిరాచౌక్ కూడలిలో పాడైన ఆర్టీసీ బస్సును రోడ్డు పక్కన ఉంచి బస్‌షెల్టర్‌గా వినియోగిస్తున్నారు. ఇలాంటి ప్రయోగంను వికారాబాద్ డిపో మేనేజర్ కూడా చేపట్టారు. వికారాబాద్ పట్టణంలోని ఎన్‌టీఆర్ కూడలిలో కాలంతీరిన ఆర్టీసీ బస్సును నిలిచి బస్‌షెల్టర్‌గా వినియోగిస్తున్నారు. ఈ రెండు ప్రాంతాలలో బస్సుల కొరకు నిత్యం పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఎదురుచూస్తుంటారు.

# వ్యాక్సినేషన్ సెంటర్ ను ప్రారంభించిన కౌన్సిలర్లు



రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్ 22: (నేటినిజం ప్రతినిధి):వేములవాడ విలీన గ్రామం శాత్రాజపల్లి లో 1,2,వ వార్డులో కోవిడ్ వ్యాక్సినేషన్ సెంటర్ ను ఆ వార్డు కౌన్సిలర్లు సంగ హనుమవ్వ స్వామి, జ య సలీమ్ లు ప్రారంభించారు . వారు మాట్లాడుతూ సంవత్సరాలు పై బడిన వారందరూ అందుబాటులో ఉన్న ఈ కోవిడ్ సెంటర్ నందు కోవిడ్ టీకా తప్పక తీసుకోవలసినదిగా ప్రజలకి విజ్ఞప్తి చేశారు . సెకండ్ వేవ్ తో వేములవాడలో ప్రజలు చాలా మంది కరోనా బారిన పడుతున్నారని సమాచారం అందుతున్నందు వల్ల 45 యేండ్ల పైబడిన వారందరూ తప్పక టీకా తీసుకొని ఎవరు కరోనా బారిన పడకుండా కాపాడుకోవలసిన బాధ్యతగా టీకా తీసుకోవలసినదిగా విజ్ఞప్తి చేశారు . మాస్కులు ధరిస్తూ , చేతులు ఎప్పటికప్పుడు శుభ్రంగా కడుక్కుంటూ , ఒకరికొకరు దూరంగా వుంటూ కోవిడ్ నియమాలను పాటించవలసినదిగా కోరారు ఈ కార్యక్రమంలో డాక్టర్ నళిని, రైతు సమన్వయ కమిటీ సభ్యులు నల్ల తిరుపతి, టీఆర్ఎస్ నాయకులు మహమ్మద్ సలీమ్ ,రేగుల రాజేష్ మ్ ,కాంగ్రెస్ నాయకులు సంగస్వామి, పంపుల అంజయ్య పూసల మోహన్, ఏఎన్ఎం సుజన, సంధ్య,ఆశ వర్కర్లు వజ్ర, వసంత తదితరులు పాల్గొన్నారు

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..




రంగారెడ్డి, ఏప్రిల్ 22: కరోనా సెకండ్ వేవ్ ఉధృతి వేగంగా ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైన ఉందని జవహర్‌నగర్ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ మేకల కావ్య అన్నారు. మున్సిపల్ శాఖ మంత్రివర్యులు కేటిఆర్ ఆదేశాల మేరకు 15వ డివిజన్‌లో ప్రధాన రహదారిపై రద్దీ ప్రాంతాల్లో బస్టాప్‌లలో సోడియం హైపోక్లోరైడ్‌ను పిచికారి చేయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వీయ నియంత్రణతోనే కొవిడ్ వైరస్ భారి నుంచి తప్పించుకోవచ్చు అన్నారు. నెల రోజుల పాటు అత్యవసర పనులుంటే తప్ప బయటకు రావద్దని అన్నారు. ప్రతి ఒక్కరు తప్పకుండా మాస్కులు ధరించి వ్యక్తిగత పరిశుభ్రత బౌతిక దూరం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ లు , మున్సిపల్ కార్పోరేషన్ సిబ్బంది, తెరాస నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# సిఎం సహాయ నిధి చెక్..



రంగారెడ్డి, ఏప్రిల్ 22: షాద్‌నగర్ మున్సిపాలిటీలో గాంధీ నగర్ కాలనీకి చెందిన పల్లటి రవీందర్‌కు సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 30వేల చెక్కును మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిఎం సహాయ నిధి చెక్కు అందజేయడం పట్ల సిఎం కేసిఆర్‌కు.. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు.. పల్లటి రవీందర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.




## గడిచిన 10 రోజుల్లో మహారాష్ట్ర నుండి 432 ప్రత్యేక రైలు సేవలను, ఢిల్లీ ప్రాంతం నుండి 1166 ప్రత్యేక రైలు సేవలను నిర్వహించిన భారత రైల్వేలు

హైదరాబాద్ ఏప్రిల్ 22: భారతీయ రైల్వే ప్రయాణికుల సౌలభ్యానికి దేశ వ్యాప్తంగా ప్రత్యేక రైలు సేవలను నడుపుతోంది. ఈ సేవల్లో మెయిల్/ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ప్యాసింజర్ రైళ్లు మరియు సబర్బన్ రైళ్లు ఉన్నాయి. సాధారణ రైలు సర్వీసులు కాకుండా అదనపు రైళ్లను ఏప్రిల్-మే, 2021 నెలల్లో వేసవి ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. 20.04.2021వ తేదీ నాటికి, భారతీయ రైల్వే రోజుకు సగటున మొత్తంగా 1512 ప్రత్యేక రైలు సేవలను (మెయిల్ / ఎక్స్‌ప్రెస్ మరియు ఫెస్టివల్ స్పెషల్స్) నడుపుతోంది.

మొత్తం 5387 సబర్బన్ రైలు సర్వీసులు, 981 ప్యాసింజర్ రైలు సర్వీసులు కూడా పని చేస్తున్నాయి. 21.04.2021 నాటికి భారత రైల్వే ఉత్తర రైల్వే (ఢిల్లీ ప్రాంతం) నుండి 53 ప్రత్యేక రైలు సర్వీసులను, సెంట్రల్ రైల్వే 41 ప్రత్యేక రైలు సర్వీసులను, వెస్ట్రన్ రైల్వే 5 ప్రత్యేక రైలు సర్వీసులను దేశ వ్యాప్తంగా వివిధ గమ్యస్థానాలకు నిర్వహిస్తోంది. 12.04.2021 నుండి 21.04.2021 వరకు, భారత రైల్వే సెంట్రల్ మరియు వెస్ట్రన్ రైల్వేల నుండి మొత్తం 432 ప్రత్యేక రైలు సేవలను, ఉత్తర రైల్వే (ఢిల్లీ ప్రాంతం) నుండి 1166 ప్రత్యేక రైలు సేవలను నిర్వహించింది. భారతీయ రైల్వే వివిధ మార్గాల్లో డిమాండ్ ప్రకారం ప్రత్యేక రైళ్లను నడుపుతుంది. ప్రయాణీకులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సౌకర్యవంతంగా ప్రయాణించేలా చూడటానికి భారత రైల్వే అన్ని ప్రయత్నాలు చేస్తుంది. ఏదైనా ప్రత్యేక మార్గాలలో తక్షణ కాలంలో రైళ్లను నడపడానికి భారత రైల్వే పూర్తిగా సిద్ధంగా ఉంది. కోవిడ్ వైరస్ వ్యాప్తి దృష్ట్యా, కోవిడ్ మార్గదర్శకాలు మరియు ప్రోటోకాల్‌లకు సంబంధించి రైల్వే ప్రయాణికులు మరియు సాధారణ ప్రజలలో అవగాహన పెంచడానికి భారత రైల్వే అన్ని ప్రయత్నాలు చేస్తోంది.

## జగన్ బెయిల్ రద్దు పిటిషన్‌పై ఈనెల 27న నిర్ణయం



అమరావతి, ఏప్రిల్ 22: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బెయిల్ రద్దు చేయాలని నర్సాపురం వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణంరాజు (ఆర్ఆర్ఆర్)ఇటీవల సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సీఎం పదవిలో ఉన్న జగన్.. తన ఆస్తుల కేసుకు సంబంధించిన ఆధారాలను, సాక్షులను ప్రభావితం చేస్తారని, ఆయనకు సహకరించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులకు ప్రమోషన్లు కూడా ఇస్తున్నారని, సీబీఐ ఇప్పటికే 11 ఛార్జిషీట్లు దాఖలు చేయగా అన్నిటిలోనూ ఆయన ఏ1గా ఉన్నారని పిటిషనర్ వాదనలు వినిపించారు. గతంలో జగన్‌కు ఇచ్చిన బెయిల్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు.

అటు ఎంపీ రఘురామకృష్ణంరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ కూడా తమ వాదనలు వినిపించింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు అసలు ఈ పిటిషన్ విచారణకు అర్హత కలిగి ఉందా, లేదా అన్న అంశంపై ఈనెల 27న తీర్పు వెల్లడించనుంది. దీంతో ఆరోజు కోర్టు ఏ నిర్ణయం ప్రకటిస్తుందన్న విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అయితే రాజ్యాంగంపై ప్రమాణం చేసిన వ్యక్తిగా తమ పార్టీకి చెడ్డ పేరు రాకుండా ఉండాలనే ఈ పిటిషన్ వేసినట్టు రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు. సీఎం జగన్ నిర్దోషిగా బయటపడాలన్నదే తన ఉద్దేశమన్నారు. కాగా అధికారిక పనుల పేరుతో వారం వారం కోర్టు విచారణకు హాజరుకాకుండా జగన్ తప్పించుకుంటున్నారని రఘురామకృష్ణంరాజు గతంలో విమర్శలు చేయడం గమనార్హం.

## సింగరేణి కార్మికులకు.. కరోనా నిబంధనలు..

ఆదిలాబాద్, ఏప్రిల్ 22: కాసిపేట కరోనా మహమ్మారి దిన దినం విస్తరిస్తున్న నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం గనులు, డిపార్ట్‌మెంట్‌లలో కరోనా వ్యాధిపై విస్తృతంగా ప్రచారం చేస్తోంది. గత ఏడాది ఇదే సమయంలో అండర్‌గ్రౌండ్ గనుల్లో లేఆప్ అమలుచేసిన యాజమాన్యం ఈ కరోనా రెండవ వేవ్‌లో ప్రభుత్వాలు లాక్‌డౌన్ అమలుచేసేది లేదని తేల్చి చెపుతుండడంతో కార్మికుల్లో కోవిడ్ నిబంధనలపై కార్మికులకు అవగాహణ కల్పిస్తూ బొగ్గు ఉత్పత్తి లక్షాలను సాధించే ప్రయత్నాలను తీవ్రం చేసింది. గత ఏడాది అనుకున్న బొగ్గు ఉత్పత్తి లక్షాలు సాధించకపోవడంతో ఆ అనుభవాలను పరిగణలోకి తీసుకుని 2021-22కు లక్షంగా పెట్టుకున్న70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించేందుకు కార్మికులు, అధికారులను మానసికంగా సిద్దంచేస్తోంది. అయితే కరోనాను అడ్డుకునేందుకు కార్మికులకు ఆసుపత్రుల్లో పరీక్షలు, పాజిటివ్ వచ్చిన కార్మికులకు మెరుగైన వైద్యం, 12 రోజులు వేతనంతో కూడిన ప్రత్యేక సెలవు, కరోనా వ్యాక్సిన్ ఇలా పలు అవకాశాలు కల్పిస్తోంది.


మరో వైపు గనులపై సమావేశాలు ఏర్పాటు చేయడం, ఏ కార్యక్రమం జరిగిన కరోనాపై అవగాహణ కల్పిస్తున్నారు.

మాస్క్ ధరించిన కార్మికులకు ఇన్‌మాస్టర్, శానిటైజర్ అందుబాటులో పెట్టడం, భౌతిక దూరం పాటించడం, మాస్కులు అందించడం, గనులు, డిపార్టమెంట్‌లపై సోడియం హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారి లాంటి పలుచర్యలను అమలు చేస్తోంది. గనిలో జ్వరం, జలుబు,దగ్గులాంటి రోగలక్షణాలు కనిపిస్తే వెంటనే అంబులెన్స్‌లో అసుపత్రికి తరలించి వైద్యం అందించడం ఇలా కరోనా కట్టడికి పలు విధాల ప్రయత్నాలను కొనసాగిస్తోంది.

ప్రభుత్వం రాత్రి కర్ఫ్యూ అమలులోకి తీసుకురావడంతో రెండవ బదిలి, రాత్రి బదిలీ కార్మికులు తప్పని సరిగా తమ వెంట ఐడెంట్ కార్డ్, ఆధార్ కార్డ్ వెంట తీసుకురావాలని, రాత్రుల్లు పోలీసు శాఖ తనిఖి సందర్భంగా కార్మికులు ఇబ్బందిపడకుండా వుంటుందని, మూడు రోజులు విధులకు హాజరు కాని ఉద్యోగులు కరోనా పరీక్షలు చేయించుకుని డ్యూటికి రావాలనే నిబంధనలు తీసుకువచ్చారు.

ఎప్పటికపుడు సంస్థలో పని చేసే ఉద్యోగుల ఆరోగ్యం పట్ల, కరోనా అడ్డుకునేందుకు యాజమాన్యం సరికొత్త అలోచనలు చేస్తుండడం దానికి ఉద్యోగులు, కార్మిక సంఘాల నుండి సంపూర్ణ మద్దతు లభిస్తుండడంతో కరోనా ఉదృతి నుండి సంస్థను కాపాడుకోగలమనే నమ్మకం యాజమాన్యానికి కలగడంతో అనుకున్న వార్షిక బొగ్గు ఉత్పత్తి టార్గెట్‌ను సాధించగలమనే విశ్వాసంతో వుంది. ఏమైనా ముందు ఆరోగ్యం ఆ తర్వాతే ఏదైనా అనుకుని కోవిడ్ నిబంధనలు పాటిస్తూ విధులకు హాజరుకావల్సిన బాద్యత కంపెనీ ఉద్యోగులపై వుందని విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

# పరిశ్రమలకు ప్రభుత్వ మద్దతు కు హామి ఇచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్.



హైదరాబాద్ ఏప్రిల్ 22: కోవిడ్-19 మహమ్మారి సెకండ్ వేవ్ నేపథ్యంలో పరిశ్రమ వర్గాలు రాగల కొద్ది రోజులు పరిస్థితులను అంచనా వేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు. పరిశ్రమలకు ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఉంటుందని ఆర్థికమంత్రి హామి ఇచ్చారు.

ఫిక్కీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను ఉద్దేశించి వర్చువల్ విధానంలో మాట్లాడుతూ శ్రీమతి సీతారామన్, ప్రధానమంత్రి జాతినుద్దేశించి చేసిన ప్రసంగం, నూతన వాక్సినేషన్ మార్గదర్శకాలు, కోవిడ్ -19 కేసులను చికిత్స అందించడంలో ఐదురకాల వ్యూహం, అంటే పరీక్షలు నిర్వహించడం, కేసులను గుర్తించడం, చికిత్స అందించడం, కోవిడ్ ప్రోటోకాల్స్ పాటించడం, వాక్సినేషన్ వంటి వాటితో ఒక రకమైన భరోసా ఉండనున్నదని ఆమె అన్నారు.

ఈ చర్యలన్నింటితో, కోవిడ్ -19 సెకండ్ వేవ్ మహమ్మారి పరిస్థితుల లో సానుకూల మార్పు ఉండగలదని ఆశిద్దాం. పరిశ్రమ వర్గాలు జాగ్రత్తగా గమనించాలి.. మీరు కూడా( పరిశ్రమ వర్గాలను) జరుగుతున్న పరిణామాలను సునిశితంగా గమనించమని నేను కోరుతున్నాను. కోవిడ్ మహమ్మారి పై పరిశ్రమతో కలసి సంఘటితంగా పోరాటం చేస్తున్నాం. ప్రగతి వేగాన్ని ముందుకు తీసుకుపోవడానికి మనం గట్టి కృషి చేయగలమన్నది అవగాహన చేసుకోవాలి. గత త్రైమాసికానికి, ఈ త్రైమాసికానికి తేడాను గమనించాలన్న ఆతృత మన అందరిలో ఉంది, అని శ్రీమతి నిర్మలా సీతారామన్ అన్నారు.

" రాగల కొద్ది రోజులు పరిస్థితులను మరింత జాగ్రత్తగా గమనించాల్సిందిగా పరిశ్రమ వర్గాలను నేను కోరుతున్నాను. ఆ తర్వాత మీరు ఈ త్రైమాసికం ఎలా ఉండబోతుందో అంచనా వేయండి" అని ఆమె అన్నారు.

ఆతిథ్యరంగం, విమానయాన రంగం, రవాణా,పర్యాటకం , హోటళు కోవిడ్ -19 ప్రారంభం నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు." మేం అత్యవసర క్రెడిట్‌లైన్ గ్యారంటీ పథకాన్ని (ఇసిజిఎల్ఎస్ 2.0)ను ఈ రంగాలకు వర్తింపచేశాం. గత సంవత్సరం ఇవి చూపిన సమర్థత పర్యాటక, విమానయాన రంగాలు కూడా చూపగలవని నేను భావిస్తున్నానను" అని ఆర్థిక మంత్రి అన్నారు.

ఆక్సిజన్ సరఫరా గురించి మాట్లాడుతూ శ్రీమతి నిర్మలా సీతారామన్, ఆక్సిజన్ సరఫరాలకు సంబంధించి జాగ్రత్తగా ఏర్పాట్లు జరిగాయని, బాగా అవసరం ఉన్న 12 రాష్ట్రాల కోసం (ఢిల్లీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఎంపి, గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, హర్యానా,కర్ణాటక, తమిళనాడు, కేరళ) కొత్త అనుమతులు కూడా ఇచ్చినట్టు ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ సరఫరాలను జిల్లా స్థాయిలో పర్యవేక్షించడంతోపాటు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి రాగల 15 రోజులకాలానికి పరిస్థితులను క్షుణ్ణంగా గమనించడం జరుగుతున్నదని చెప్పారు. " ఆక్సిజన్ ట్యాంకర్ల అంతర్ రాష్ట్ర రవాణాకు ప్రభుత్వం మినహాయింపులు ఇచ్చింది. రిజిస్ట్రేషన్, పర్మిట్‌లకు మినహాయింపు ఇవ్వడం జరిగింది. నిరంతరాయంగా రోజంతా కార్యకలాపాలు నిర్వహించవచ్చు. లోటు లేకుండా చూసేందుకు సిలిండర్‌లు నింపే ప్లాంట్లు తగిన రక్షణలు తీసుకుంటూ 24 గంటలూ పనిచేస్తున్నాయి." అని ఆర్థికమంత్రి తెలిపారు

ఫార్మారంగ సామర్థ్యం పెంపు గురించి వివరిస్తూ , శ్రీమతి నిర్మలా సీతారామన్, కీలకమైన ఔషదాలకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రెమిడిసివర్ ఉత్పత్తికి ఫాస్ట్‌ట్రాక్ అనుమతులు ఇచ్చినట్టు ఆమె తెలిపారు. రాగల కొద్ది నెలల్లో వీటిని నెలకు లక్ష వయల్స్ తయారీ సామర్థ్యానికి పెరుగుతుందన్నారు.

వైద్యరంగానికి అవసరమైన ఆక్సిజన్ డిమాండ్‌ను తీర్చిన తర్వాత పరిశ్రమకు కూడా అవసరమైన ఆక్సిజన్ సరఫరా జరుగుతుందని, మెడికల్ ఆక్సిజన్ దిగుమతలుకు అనుమతి ఇచ్చినట్టు ఆమె తెలిపారు.

ఫిక్కీ అధ్యక్షుడు శ్రీ ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ, అత్యవసర, అత్యవసరం కాని సరకులకు సంబంధించి కొంత స్పష్టత అవసరమని చెప్పారు.ఎం.ఎస్.ఎం.ఇ రంగానికి మద్దతు అవసరమని, ప్రస్తుతం ఈ రంగం ఇబ్బందులను ఎదుర్కొంటున్నదని చెప్పారు.

ఫిక్కీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ సంజీవ్ మెహతా వందన సమర్పణ చేస్తూ, ప్రజల ప్రాణాలు కాపాడడానికి, ప్రజల జీవనోపాధి కాపాడడానికి ప్రభుత్వం చేసే కృషికి పరిశ్రమ పూర్తిగా మద్దతు నిస్తుందని పునరుద్ఘాటించారు

# వచ్చే మార్చికల్లా 65వేల ఇళ్లకు నీటి కుళాయిల ఏర్పాటు

హైదరాబాద్ ఏప్రిల్ 22: జలజీవన్ మిషన్ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లకు మంచినీటి కుళాయిల ఏర్పాటుకు సంబంధించి వార్షిక కార్యాచరణ ప్రణాళికను అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్సింగ్ విధానంలో సమర్పించింది. 2021-22వ సంవత్సరానికి సంబంధించి సంతృప్తి స్థాయిలో ఈ ప్రణాళకను సమర్పించారు. 2023వ సంవత్సరానికల్లా 'ప్రతి ఇంటికీ నీరు' అన్న లక్ష్యాన్ని సాధించేందుకు తాము చిత్తశుద్ధితో కృషిచేస్తున్నట్టు అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం తన ప్రణాళికలో మరోసారి స్పష్టం చేసింది. అరుణాచల్ ప్రదేశ్ లోని గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 2.17లక్షల ఇళ్లు ఉండగా, వాటిలో లక్ష ఇళ్లకు అంటే, 47శాతం ఇళ్లకు నీటి కుళాయిల కనెక్షన్లు ఉన్నాయి. పర్వతమయమైన ఈ రాష్ట్రంలో 2020-21వ సంవత్సరంలో దాదాపు 65వేల ఇళ్లకు కొత్తగా నీటి కనెక్షన్లు ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటికీ నీరు అన్న లక్ష్యాన్ని 2021-22వ సంవత్సరంలో 3 జిల్లాలకు, 18 సమితులకు, 1,825 గ్రామాలకు వర్తింప జేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అంటే, ఈ ప్రాంతంలో వందశాతం ఇళ్లకు నీటిసరఫరా అందజేసినట్టవుతుంది. ఇంకా 2021-22 సంవత్సరంలో కూడా 65వేల ఇళ్లకు నీటి కుళాయిలతో మంచినీటిని సరఫరా చేయాలని అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం సంకల్పించింది.

కాగా, ఇళ్లకు పైపులద్వారా నీటి సరఫరా విషయంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ప్రాబల్యం ఉన్న ఆవాసాలకు, ఆశావహ జిల్లాలకు ప్రాధాన్యం ఇవ్వాలని జాతీయ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఇంటికీ పైపుల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ కార్యక్రమాన్ని ఒక ప్రధాన పథకంగా చేపట్టింది. నీటి సరఫరాకు సంబంధించి 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ. 345కోట్ల కేంద్ర నిధులు ఈ రాష్ట్రానికి విడుదలయ్యాయి. ఇక జలజీవన్ మిషన్ కింద 2021-22లో రూ. 600కోట్లు అందనున్నాయి. నీటి సరఫరా పథకాల అమలులో పనితీరు మెరగుదులకు గుర్తింపుగా గత ఏడాది ఈ రాష్ట్రానికి ప్రోత్సాహక గ్రాంట్ విడుదలైంది. దీనితో ఇతర వనరుల నిధులను కూడా నీటి సరఫరా పనులకోసం సమర్థంగా వినియోగించుకునేందుకు గల అవకాశాలను అన్వేషించాలని మంత్రిత్వ శాఖ అధికారులు రాష్ట్రానికి సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం అరుణాచల్ ప్రదేశ్ లోని 86శాతం ఆరోగ్య రక్షణ కేంద్రాలకు, 79శాతం పాఠశాలలకు, 60శాతం ఆశ్రమశాలలకు, 57శాతం అంగన్ వాడీ కేంద్రాలకు పైపుల ద్వారా మంచినీటి సరఫరా ఏర్పాటైంది. ఇక 2021-22వ సంవత్సరంలో ఈ సంస్థలన్నింటికీ వందశాతం నీటి సరఫరా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇక జలజీవన్ మిషన్ పనులను నిరాటంకంగా అమలయ్యేలా చూసేందుకు, పనుల నిర్వహణలో అంతరాలను పూడ్చేందుకు వీలుగా రాష్ట్ర స్థాయి, జిల్లాల, డివిజన్ల స్థాయిలో నిపుణుల సేవలను వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు కూడా వందశాతం నీటి సరఫరాను వర్తింపజేసే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

జలజీవన్ మిషన్ కింద రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిల్లో నీటి నాణ్యతను పరీక్షించే పరిశోధనాశాలలు ప్రారంభించారు. నామమాత్రపు రుసుం చెల్లింపుతో సాధారణ ప్రజలు కూడా నీటి నాణ్యతను పరీక్షించుకునే సదుపాయంతో వీటిని ఏర్పాటు చేశారు. నీటి నాణ్యతపై నిఘాతో వ్యవహరించేలా ప్రజాసంఘాలకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తున్నారు. ప్రజారోగ్య ఇంజినీరింగ్ శాఖ ఇందుకు తగిన ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం సకాలంలో పరీక్షల కిట్లు సరఫరా చేయడం, ప్రజా సంఘాల్లో ప్రాతినిధ్యం కోసం ప్రతి గ్రామనుంచి కనీసం ఐదుగురు మహిళలను గుర్తించడం, క్షేత్రస్థాయి నీటి నాణ్యతా పరీక్షల కిట్లను, పరికరాలను వినియోగించడంలో, పరీక్షా ఫలితాలపై నివేదిక ఇవ్వడంలో మహిళలకు శిక్షణ ఇవ్వడం వంటి కార్యక్రమాలకు ప్రణాళిక వేసుకున్నారు. 2020-21వ సంవత్సరంలో అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం నీటి వనరుల వద్ద 83.4శాతం రసాయన పరీక్షలను, నీటి సరఫరా జరిగే ప్రాంతాల్లో 91.8శాతం పరీక్షలు నిర్వహించింది. పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలకైతే వందశాతం రసాయన పరీక్షలు, బాక్టీరియా సంబంధ పరీక్షలు నిర్వహించారు. ప్రజలు కూడా నామమాత్రపు చార్జీలు చెల్లించి నీటి నాణ్యతను పరీక్షించుకునే వెసులుబాటును కల్పించేందుకు వీలుగా నీటి పరీక్షల లేబరేటరీలకు ఎన్.ఎ.బి.ఎల్. గుర్తింపును పొందవలసిందిగా రాష్ట్రానికి కేంద్రం సూచించింది.

తాగు నీటి వనరులను బలోపేతం చేయడం, మురుగునీటి నిర్వహణ, పునర్వినియోగం, గ్రామాల్లో నీటి సరఫరా వ్యవస్థ నిర్వహణ తదితర అంశాలను కూడా అరుణాచల్ ప్రదేశ్ తన కార్యాచరణ ప్రణాళికలో పేర్కొంది. నీటి సరఫరాకు సంబందించి రాష్ట్ర, జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహణా విభాగం సిబ్బందికి, గ్రామ నీటి సరఫరా, పారిశుద్ధ్య కమిటీ, పానీ సమితి సభ్యులకు పటిష్టమైన నైపుణ్య శిక్షణ ఇవ్వాలని అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం సంకల్పించింది. రాష్ట్రంలో దాదాపు 5వేల మందికి మేస్త్రీలుగా, ప్లంబర్లుగా, ఎలెక్ట్రీషియన్లుగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇలా శిక్షణ పొందిన వారిని నీటి సరఫరా మౌలిక సదుపాయాల నిర్మాణానికి, వాటి నిర్వహణకు వినియోగించుకుంటారు.

జలజీవన్ మిషన్ పథకం కింద 2021-22లో బడ్జెట్లో కేటాయించిన రూ. 50,011 కోట్ల కు అదనంగా, గ్రామీణ స్థానిక సంస్థలకు నీరు, పారిశుద్ధ్యానికి సంబంధించి15వ ఆర్థిక సంఘంతో అనుబంధించిన రూ. 26,940కోట్ల నిధులు కూడా అందుబాటులో ఉన్నాయి. దీనికి తోడు రాష్ట్రంనుంచి మ్యాచింగ్ వాటా నిధులు, రాష్ట్ర ప్రాజెక్టుల నిధులు కూడా అందుబాటులో ఉన్నాయి. దీనితో మొత్తం దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాకోసం 2021-22లో లక్షకోట్ల రూపాయలకు పైగా నిధులను ఖర్చుపెట్టాలని సంకల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంతటి భారీ స్థాయి పెట్టుబడులతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా మంచి ఊపందుకుంటుంది..

జలజీవన్ మిషన్ కింద గ్రామ స్థాయిలో అందుబాటులో ఉన్న ఇతర వనరుల నిధులన్నింటినీ కూడగట్టేందుకు కృషి జరుగుతోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జలజీవన్ మిషన్, స్వచ్ఛ భారత మిషన్ నిధులు, పంచాయతీ రాజ్ సంస్థలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు, కాంపా నిధులు, స్థానిక ప్రాంత అభివృద్ధి నిధులు తదితర నిధులను కూడగట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. గ్రామాల్లో నీటి సరఫరా వ్యవస్థలు దీర్ఘకాలం మనగలిగేలా, తద్వారా గ్రామాలకు తాగునీటి రక్షణ కల్పించేలా గ్రామ సంఘాలకు, గ్రామ పంచాయతీలకు, వినియోగ సంఘాలకు తగిన ప్రమేయం కల్పించాలని కేంద్రం రాష్ట్రాలను కోరింది. ఇందుకోసం నీటి సరఫరా ప్రణాళిక, అమలు, నిర్వహణలలో ఆయా గ్రూపులకు తగిన పాత్ర కల్పించాలని సూచించారు. జలజీవన్ మిషన్ పథకం, లక్ష్యాలను గురించి ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు అధునాతన ఎలెక్ట్రానిక్ పద్ధతుల్లో ప్రచారం ప్రారంభించాలని కేంద్రం రాష్ట్రానికి సూచించింది.

ఇందులో భాగగా జలజీవన్ మిషన్ ప్రతి ఏడాది రాష్ట్రాల అధికారులతో చర్చించి, నీటి సరఫరా పనుల అంచనాపై కసరత్తు చేస్తుంది. తద్వారా వార్షిక కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేస్తుంది. ఈ ప్రతిపాదిత ప్రణాళికను తాగునీరు, పారిశుద్ధ్యం శాఖ కార్యదర్శి అధ్యక్షతలోని జాతీయ కమిటీ మథింపు చేస్తుంది. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని వివిధ మంత్రిత్వ శాఖల విభాగాల సభ్యులకు, నీతీ ఆయోగ్ సభ్యులకు ఈ జాతీయ కమిటీలో ప్రాతినిధ్యం ఉంటుంది. వార్షిక కార్యాచరణ ప్రణాళిక ఖరారైన అనంతరం ఎప్పకప్పుడు పనుల ప్రగతి, జరిగిన ఖర్చు వంటి అంశాల ప్రాతిపదికన నిధులను విడుదల చేస్తారు. సాంకేతిక నిపుణుల బృందం ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈ నిధులు అందిస్తారు. తద్వారా జలజీవన్ మిషన్ కింద గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ నీరు అందించాలన్న లక్ష్యాన్ని సాధించే పనులను సజావుగా అమలు చేసేందుకు ఈ నిపుణుల బృందం తగిన మార్గదర్శకత్వం వహిస్తుంది.

# కేసీఆర్ ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు..

ఆదిలాబాద్, ఏప్రిల్ 22: రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కరోనా పాజిటివ్ నుండి త్వరగా కోలుకోవాలని గుర్తింపు సంఘం నాయకులు దుగుట శ్రీనివాస్ పేర్కొన్నారు. మందమర్రి ఏరియా కాసిపేట గని మైసమ్మ దేవాలయంలో టీబీజీకెఎస్ నాయకులు, కార్మికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్ని జాగ్రత్తలు పాటిస్తున్నప్పటికి కరోనాను నియంత్రించ లేకపోతున్నామని అన్నారు. దేశ, రాష్ట్ర నాయకులు, అధికారులు సైతం కరోనా బారిన పడుతున్నారని, వ్యాధి పెరిగి పలువురు చనిపోతున్నారని బాధను వ్యక్తం చేశారు. గని ఉద్యోగులు తప్పనిసరిగా అధికారుల సూచనలతో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రజల దీవెనలు వున్న కేసీఆర్ త్వరగా కోలుకుంటారని, బంగారు తెలంగాణ సాధనకై విరామమెరుగక పాటుపడతారననే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం నాయకులు సొల్లంగి శ్రీనివాస్, బానోత్ తిరుపతి, దొమ్మటి రమేష్, బండారి రమేష్,బదిలీ వర్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భువనచంద్ర, నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా భద్రాద్రి రామయ్య మహాపట్టాభిషేకం



భద్రాచలం, ఏప్రిల్ 22: : భద్రాద్రిలో శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్య కల్యాణ మండపం వద్ద శ్రీరాముని మహాపట్టాభిషేకం గురువారం మధ్యాహ్నం వైభవంగా జరిగింది. కొవిడ్ నిబంధనలు కారణంగా భక్తులు లేకుండా వైదిక సిబ్బంది సమక్షంలో ఈ క్రతువు నిర్వహించారు నిరాడంబరంగా జరిగిన రాములవారి పట్టాభిషేకం కార్యక్రమంలో ముందుగా రాములోరికి . బంగారు కిరీటం, పాదుకలు, రాజదండంతో అలంకరణ చేశారు. అనంతరం పట్టాభిషేకం కార్యక్రమాన్ని వేదమంత్రోచ్చారణల నడుమ పూర్తి చేశారు.. కాగా, రాత్రి 7 గంటలకు స్వామివారి రజత రథోత్సవం నిర్వహించనున్నారు. ఇది ఇలా ఉంటే బ్రహ్మోత్సవాల దృష్ట్యా 27 వరకు నిత్య కల్యాణాలు ని, పూజలు, తీర్థ ప్రసాదాలు నిలిపివేశారు.

## ప్రైవేటు టీచర్లకు బియ్యం పంపిణీ..




కరీంనగర్. ఏప్రిల్ 22:(నేటినిజం ప్రతినిధి):కరోనా కష్టకాలంలో ప్రైవేటు విద్యా సంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావడం గొప్ప నిర్ణయమని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రేషన్ దుకాణాల వద్ద ప్రైవేటు టీచర్లకు ప్రభుత్వం ప్రకటించిన 25 కిలోల బియ్యం పంపిణీని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రైవేటు టీచర్ల ఇబ్బందులను గుర్తించి రూ. 2వేల ఆర్థికసాయంతోపాటు 25 కిలోల బియ్యాన్ని అందించేందుకు ముందుకు వచ్చారన్నారు. పాఠశాలలు మూసి వేయడంతో ప్రైవేటు టీచర్లు ధీనావస్థలో ఉన్నారని, వారి ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకోవడం శుభపరిణామమన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రైవేటు టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో డీఈఓ జగన్మోహన్‌రెడ్డి, ఎంఈఓ సురేంద్రకుమార్, కౌన్సిలర్ పోతని పురుషోత్తం, టీచర్లు సంపత్‌రెడ్డి, సత్యనారాయణ, తెరాస నాయకులు పాల్గొన్నారు.

## పరీక్షల విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది: లోకేష్

అమరావతి, ఏప్రిల్ 22: ఏపీలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్షలను నిర్వహించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం టిడిపి నాయకుడు నారా లోకేష్ విమర్శించారు. పరీక్షలను నిర్వహిస్తే 80 లక్షల మంది కరోనా బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రమాదకర పరిస్థితులను అర్థం చేసుకోకుండా ప్రభుత్వం మొండిగా పరీక్షలను నిర్వహించాలనుకుంటోందని దుయ్యబట్టారు. అనేక రాష్ట్రాలు పరీక్షలను వాయిదా వేస్తుంటే? ఏపీలో మాత్రం పరిస్థితి విరుద్ధంగా ఉందని అన్నారు. ప్రభుత్వంలో మార్పు రాకపోతే కరోనాను కట్టడి చేయడం చాలా కష్టమవుతుందని చెప్పారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులకు కరోనా సోకి, ఆ తర్వాత వాళ్ల కుటుంబ సభ్యులు మహమ్మారి బారిన పడితే ముఖ్యమంత్రి జగన్ బాధ్యత తీసుకుంటారా? అని ప్రశ్నించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలతో ఆన్ లైన్ లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

## ఏకగ్రీవంగా ఎన్నికైన కౌన్సిలర్ కి సన్మానం..



ఆదిలాబాద్, ఏప్రిల్ 22: మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డు ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ తరుపున ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు సుకేషిని భరద్వాజ్. వారిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత-శ్రీధర్, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు, టీఆర్ఎస్ నాయకులు గెల్లె రాజలింగు, తదక రవి తదితరులు పాల్గొన్నారు.

# రైతు భీమా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ..

-రైతును రాజుగా చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం
-జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థంపుమాధవి రాజు
-వేములవాడ మార్కెట్ లో మున్సిపల్ చైర్ పర్సన్ -మాధవితో కలిసి వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్ 22: (నేటినిజం ప్రతినిధి):రైతులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ కొనుగోళ్లతో పాటు అన్నిరంగాల్లో ఇబ్బందులు లేకుండా చేస్తున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి అన్నారు.గురువారం వేములవాడ వ్యవసాయ మార్కెట్ లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జడ్పీ చైర్ చైర్పర్సన్ ,మున్సిపల్ చైర్పర్సన్ మాధవి తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా జెడ్పీచైర్పర్సన్ మాట్లాడుతూ దేశంలోనేరికార్డుస్థాయిలో పంట సాగు అవుతున్న రాష్ట్రం తెలంగాణ అన్నారు..24 గంటల విద్యుత్ తో పాటు సాగనీటికి ఢోకా లేకపోవటం ఫలితంగా పంట దిగుబడి పెరిగిందన్నారు. రైతుబంధు పథకం దేశంలో ఎక్కడా లేదని ఒక్క తెలంగాణ లోనే రైతు మరణిస్తే 5 లక్షలిస్తూ అండగా నిలుస్తుందన్నారు..గత ముప్పై ఎండ్లలో మరణించిన రైతులను కనీసం పట్టించుకున్న నాధుడే లేడని కనీసం ఐదువేలు కూడఇవ్వలేదన్నారు..ప్రభుత్వ స్కీంలను ప్రతిఒక్కరు వినియోగించుకోవాలని,రైతుభీమా నమోదు చేసుకోవా లని కోరారు. జాగ్రత్తలు పాటిస్తూ కొనుగోల్లు,అమ్మకాలు జరపాలని అన్నారు.ఆనంతరంమున్సిపల్ చైర్పర్సన్ మాధవి రాజు మాట్లాడుతూ రైతును రాజుగా చేయటవే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు అధికారులు,రైతులు సమన్వయంతో కొనుగోల్లు జరపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డం హనుమాన్లు , రుద్రవరం పి.ఎ.సిసి చైర్మెన్ రేగుల కృష్ణదేవరాయలు ,టీఆర్ఎస్ నాయకులు పుల్కం రాజు , అన్నారం శ్రీనివాస్ ,రె?డివెఐ? ప ర్శరాములు, మార్కెట్ కమిటీ అధికారులు' సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# వంద పడకల ఆసుపత్రిని పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్



రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్ 22: (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లో నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ శ్రీ కృష్ణ భాస్కర్ ఆదేశించారు.గురువారం కలెక్టర్ తుది దశ నిర్మాణ పనుల్లో ఉన్న వంద పడకల ఆసుపత్రిని క్షేత్ర స్థాయిలో సందర్శించి, పనుల పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా ఆసుపత్రిని ప్రారంభించి వైద్య సేవలు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆసుపత్రిలో సమకూర్చాల్సిన మెటీరియల్, విద్యుత్ కనెక్షన్, తదితర విషయాల గురించి డా.మహేష్ రావు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఆసుపత్రి పరిసరాలలో ఉన్న చెత్త, చెదారాన్ని శుభ్రం చేసేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. ఏ ఇబ్బందులు లేకుండా తుది దశలో ఉన్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ఈ నెలాఖరులోగా ఆసుపత్రి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట డా.మహేష్ రావు, సంబంధిత కాంట్రాక్టర్ లు, తదితరులు ఉన్నారు.

# ప్రైవేటు ఉపాధ్యాయులకు బియ్యం పంపిణీ..



రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్ 22: (నేటినిజం ప్రతినిధి): కరోనా మహమ్మారి నేపథ్యంలో ఉపాధి కోల్పోయిన ప్రైవేట్ ఉపాధ్యాయులకు గురువారం సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు,

ఉపాధి కోల్పోయిన ప్రైవేట్ ఉపాధ్యాయులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం రెండు వేల నగదు తో పాటు 25 కిలోల బియ్యాన్ని ప్రకటించగా ఇట్టి కార్యక్రమాన్ని వేములవాడ పట్టణంలో ప్రైవేట్ ఉపాధ్యాయులకు అందజేశారు, మండలంలో అర్హతగల అన్ని ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఈ బియ్యం పంపిణీ చేస్తామని అర్బన్ తహసీల్దార్ మునిందర్ తెలిపారు, ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి రాజు , తహసీల్దార్ మునిందర్ , వైస్ చైర్మన్ మధు రాజేందర్ కౌన్సిలర్లు అన్నారు ఉమారాణి శ్రీనివాస్, ముప్పిడిసునంద శ్రీనివాస్ శ్రీనివాస్ , రెవెన్యూ ఇన్స్పెక్టర్ తదితరుల పాల్గొన్నారు ,

## కోవిడ్-19 స్థితి ని సమీక్షించడం కోసం ఉన్నత స్థాయి సమావేశాలు ఉన్న కారణం గా పశ్చిమ బంగాల్ పర్యటన ను రద్దు చేసుకొన్న ప్రధాన మంత్రి

హైదరాబాద్ ఏప్రిల్ 22: కోవిడ్-19 ప్రస్తుత స్థితి ని సమీక్షించడం కోసం ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ రేపటి రోజు న, అంటే శుక్రవారం నాడు, జరిగే ఉన్నత స్థాయి సమావేశాల కు అధ్యక్షత వహించనున్నారు.

"రేపటి రోజు న, అంటే శుక్రవారం నాడు, కోవిడ్-19 ప్రస్తుత స్థితి ని సమీక్షించడం కోసం ఉన్నత స్థాయి సమావేశాలకు అధ్యక్షత వహించనున్నాను. ఈ కారణం గా, నేను పశ్చిమ బంగాల్ కు వెళ్లడం లేదు." అని ఒక ట్వీట్ లో శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

# విశాఖపట్టణం, బొకారోల నుండి మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్‌లకు లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్‌ను (ఎల్ఎంఓ) తరలించేందుకు సిద్ధమవుతున్న ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు

హైదరాబాద్ ఏప్రిల్ 22: కోవిడ్-19కి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటానికి ప్రతిస్పందనగా భారతీయ రైల్వే సంస్థ ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతోంది. లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ (ఎల్ఎంఓ) ట్యాంకర్లతో కూడిన ఫస్ట్ ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ రాత్రి విశాఖపట్నం నుండి ముంబయి నగరానికి తన ప్రయాణాన్ని ప్రారంభించనుంది. విశాఖపట్నం వద్ద ఎల్ఎంఓతో నిండిన ట్యాంకర్లను భారత రైల్వే రో-రో సర్వీస్ ద్వారా రవాణా చేస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని మెడికల్ ఆక్సిజన్ అవసరాలను తీర్చడానికి లక్నో నుండి బోకారోకు వారణాసి మీదుగా మరో ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ తన ప్రయాణాన్ని ప్రారంభించింది.

ఈ ఆక్సిజన్ రైలు కదలిక కోసం లక్నో నుండి వారణాసి మధ్య గ్రీన్ కారిడార్ సృష్టించబడింది.

లక్నో నుండి వారణాసి వరకు గల 270 కిలోమీటర్ల దూరాన్ని సగటున 62.35 కిలోమీటర్ల వేగంతో 4 గంటల 20 నిమిషాల్లో చేరుకొనేలా గ్రీన్ కారిడార్‌ను సృష్టించారు. రైళ్ల ద్వారా ప్రాణ వాయువు (ఆక్సిజన్) రవాణా రహదారి మార్గంలో రవాణా కంటే కూడా ఎక్కువ వేగంగా ఉంటుంది. రైళ్లు రోజులో 24 గంటలు నిరంతరాయంగా నడవగలవు.. కానీ ట్రక్ డ్రైవర్లు తమ రవాణాలో ఎక్కడో ఒక దగ్గర ఆగిపోయి విశ్రాంతి తీసుకోవడం అవసరం. రైల్వేకు చెందిన ఫ్లాట్ వ్యాగన్లలో / నుండి ట్యాంకర్లను లోడ్ చేయడానికి / అన్‌లోడ్ చేయడానికి, ర్యాంప్ ఎంతో అవసరమనేది ఇక్కడ గమనార్హం. అలాగే, కొన్ని ప్రదేశాలలో రోడ్ ఓవర్ వంతెనలు (ఆర్‌ఓబీలు) మరియు ఓవర్ హెడ్ ఎక్విప్మెంట్ (ఓహెచ్ఈ) యొక్క పరిమితుల కారణంగా, రోడ్ ట్యాంకర్ల యొక్క వివిధ స్పెసిఫికేషన్లలో, 3320 మి.మీ. ఎత్తుతో ఉండే రోడ్డు రవాణా ట్యాంకర్ టీ 1618 యొక్క మోడల్ అనువైనదిగా గుర్తించడమైంది. 1290 మి.మీ. ఎత్తుతో ఫ్లాట్ వ్యాగన్ల (డీబీకేఎం) పై దీనిని ఉంచనున్నారు. గత ఏడాది లాక్‌డౌన్ సమయంలో కూడా భారత రైల్వేలు అవసరమైన వస్తువులను రవాణా చేశాయి. లాక్‌డౌన్ సమయంలో కూడా సంస్థ సరఫరా గొలుసు ముందుకు సాగేలా సేవలను కొనసాగించింది. అత్యవసర వేళల్లో దేశానికి సేవలను కొనసాగిస్తు వస్తోంది.

# కరోనా కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు - క్యాబినేట్ సబ్ కమిటి

అమరావతి, ఏప్రిల్ 22: కరోనా కట్టడికి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని, ఆస్పత్రుల్లో మెడిసిన్, ఆక్సిజన్ అన్నీ సిద్ధంగా ఉంచామని డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని అన్నారు. అన్ని పరిస్థితులను అత్యంత సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సీఎం వైయస్ జగన్ ప్రతి రోజూ అధికారులతో సమీక్షలు చేస్తూ కరోనా నియంత్రణకు స్పష్టమైన ఆదేశాలతో దిశానిర్దేశం చేస్తున్నారన్నారు.

కోవిడ్ కట్టడి, వ్యాక్సినేషన్, కమాండ్ కంట్రోల్ నిర్వహణపై డిప్యూటీ సీఎం ఆళ్ల నాని నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ భేటీ అయ్యింది. కమిటీ సభ్యులు మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, మేకతోటి సుచరిత, బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, కురసాల కన్నబాబు, డీజీపీ గౌతమ్ సవాంగ్, ఇతర శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

సమావేశం అనంతరం మంత్రి ఆళ్ల నాని మీడియాతో మాట్లాడారు. కోవిడ్ నియంత్రణ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి సీఎం జగన్ గ్రూప్ ఆఫ్ మినిస్టర్ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొని సలహాలు, సూచనలు అందించారన్నారు. సమావేశంలో కోవిడ్ నివారణ చర్యలపై చర్చించడం జరిగిందన్నారు. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆస్పత్రుల్లో బెడ్స్ పెంచడం, కోవిడ్ కేర్ సెంటర్లు పెంచడం, రెమిడిసివర్ ఇంజక్షన్, ఆక్సిజన్ కొరతను నివారించేందుకు అవసరమైన చర్యలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగిందన్నారు. ఆస్పత్రుల వద్ద హెల్ప్ డెస్కులు, 104 కాల్ సెంటర్ మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామన్నారు.

ఆస్పత్రుల్లో కరోనా బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, ఆస్పత్రుల్లో బెడ్లు, మెడిసిన్, ఆక్సిజన్ అన్ని సిద్ధంగా ఉంచామన్నారు. ఆక్సిజన్ కొరతను ఎదుర్కొనేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరిగిందని చెప్పారు. కేబినెట్ సబ్ కమిటీ సూచనలను సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. ఎక్కడా కూడా ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, జగన్ నాయకత్వంలో అన్ని పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందన్నారు.ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే కరోనా బాధితుల నుంచి ఎక్కువగా వసూలు చేసే ప్రైవేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తప్పవని మంత్రి ఆళ్ల నాని హెచ్చరించారు. దయచేసి అలాంటి పరిస్థితులను కొనితెచ్చుకోవద్దని సూచించారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు



అమరావతి, ఏప్రిల్ 22: ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు కంటే కరోనా బాధితుల నుంచి అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలను డిప్యూటీ సీఎం ఆళ్ల నాని హెచ్చరించారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం కరోనా నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని, రాష్ట్ర ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వాసుపత్రులకు అవసరమైన ఆక్సిజన్ నిల్వలు ఉన్నాయన్నారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి సప్లయర్స్ నుంచి ఆక్సిజన్ కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సొంతంగా ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణానికి గల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సీఎం జగన్ ఆదేశించారన్నారు. రాష్ట్రంలో కరోనా కట్టడికి ఏర్పాటు చేసిన అయిదుగురు మంత్రుల సబ్ కమిటీ సమావేశం? కన్వీనర్, డిప్యూటీ సీఎం ఆళ్ల నాని అధ్యక్షతన మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో గురువారం జరిగింది. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రులు సుచరిత, కన్నబాబు, ఆదిమూలపు సురేష్ తో కలిసి ఆయన మాట్లాడారు. కోవిడ్ నివారణ చర్యలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించామన్నారు. ఆస్పత్రుల్లో మందులు, ఆక్సిజన్ కొరత లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని నిర్ణయించామన్నారు.

రాష్ట్రంలో అమలవుతున్న కరోనా కార్యక్రమాలు మరింత పటిష్టంగా అమలు చేయడానికి మంత్రుల సబ్ కమిటీని సీఎం జగన్ ఏర్పాటు చేశారని డిప్యూటీ సీఎం ఆళ్ల నాని తెలిపారు. మంత్రుల సబ్ కమిటీలో కేసులు ఇంకా ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామన్నారు. ఆసుపత్రులు, కొవిడ్ సెంటర్ల సంఖ్య పెంచడంపైనా చర్చించామన్నారు. హెల్ప్ డెస్క్ ల ఏర్పాటుతో పాటు 104 కాల్ సెంటర్ బలోపేతం చేయుడంపైనా చర్చించామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు కంటే ఎక్కువగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఆళ్ల నాని హెచ్చరించారు.

ఆసుపత్రుల నిర్వహణ, మందుల పంపిణీ విషయంలో అత్యంత సమర్థతో వ్యవహరిస్తున్నామని డిప్యూటీ సీఎం ఆళ్ల నాని తెలిపారు. మంత్రుల సబ్ కమిటీ సమావేశంలో ఆక్సిజన్ కొరత నివారణకు అవసరమైన చర్యలపైనా చర్చించామని ఆయన తెలిపారు. ఏపీలో ఆక్సిజన్ కొరతను ఎదుర్కోడానికి కార్యచరణ ప్రణాళికను రూపొందించామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాసుపత్రులకు అవసరమైన ఆక్సిజన్ అందుబాటులో ఉందన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు కూడా అందించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం రోజూ 360 మెట్రిక్ టన్నులు అవసరమని అధికారులు చెబుతున్నారన్నారు. కేసులు సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా మరో 100 నుంచి 150 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ అవసరమవుతుందన్నారు. ఆ మేరకు కొరత రానివ్వకుండా ఒడిశా, తెలంగాణ, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఆక్సిజన్ సప్లయర్స్ తో మాట్లాడుతున్నామన్నారు. డిమాండ్ కు తగిన సప్లయ్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఎక్కువ ఆక్సిజన్ నిల్వలు కేటాయించాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని వివరించారు. సొంతంగా ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణానికి గల అవకాశాలను పరిశాలించాలని అధికారులను సీం జగన్మోహన్ రెడ్డి ఆదేశించారన్నారు.

వాక్సినేషన్ లో ఏపీ ముందుందని, ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 49 లక్షల మందికి పైగా వ్యాక్సిన్ చేశామని డిప్యూటీ సీఎం ఆళ్ల నాని తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో ఒకే రోజు 6 లక్షల మందికి పైగా వాక్సిన్ వేశామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నెట్ వర్క్ ద్వారా ఇది సాధ్యమైందన్నారు. వ్యాక్సిన్ పంపిణీ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అంశమన్నారు. కేంద్రమిచ్చిన వాక్సిన్ ను ప్రజలకు సమర్ధవంతంగా అందజేస్తున్నామని వెల్లడించారు. కేంద్రమిచ్చిన వాక్సినేషన్ ను ఒకటి రెండ్రోజుల్లో పంపిణీ చేసే నెట్ వర్క్ ఏపీలో ఉందన్నారు.

కరోనా రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే సీఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని డిప్యూటీ సీఎం ఆళ్ల నాని తెలిపారు. సబ్ కమిటీలో చర్చించిన విషయాలను సీఎం తో జరగబోయే సమావేశంలో వివరిస్తామన్నారు. ప్రజలు భయాందోళనలకు గురకావొద్దని, కరోనా నియంత్రణకు సీఎం జగన్మోహన్ రెడ్డి పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సీఎం జగన్.. ప్రతి రోజూ సమీక్షలు చేస్తూ అధికారులను, తమను అప్రమత్తం చేస్తున్నారన్నారు. కరోనా కట్టడిలో సీఎం జగన్ చేసే పోరాటానికి ప్రజల మద్దతు ఉంటేనే విజయం సాధించగలమన్నారు.

ప్రస్తుత వైరస్ చాలా వేగంగా వ్యాప్తి చెందుతోందని, ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు. మాస్కులు ధరించడంలో నిర్లక్ష్యం చూపొద్దని, తప్పనిసరి అయితేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకొస్తే? భౌతిక దూరం పాటించాలని, తరుచూ చేతులు శానిటైజేషన్ చేసుకోవాలని వివరించారు. వ్యక్తిగత జాగ్రత్తలే కరోనా నివారణలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయన్నారు. టెస్టుల చేసిన తరవాత ఫలితాలను త్వరితగతిన ఇచ్చేలా అధికారులను ఆదేశించామన్నారు. ఫ్రంట్ లైన్ వారియర్స్ తో పాటు నిబంధనల ప్రకారం అర్హులైన వారంతా కచ్చితంగా వ్యాక్సిన్ తీసుకోవాలని ఆళ్ల నాని కోరారు.

# ఆక్సిజన్ సరఫరా.. లభ్యతపై ప్రధాని ఉన్నతస్థాయి సమావేశం

హైదరాబాద్ ఏప్రిల్ 22: దేశవ్యాప్తంగా ఆక్సిజన్ సరఫరాపై సమీక్ష, లభ్యతను పెంచే మార్గాంతరాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. కాగా, ఆక్సిజన్ సరఫరా మెరుగుపరచేందుకు కొన్ని వారాలుగా తీసుకున్న చర్యల గురించి అధికారులు ఆయనకు వివరించారు. అయితే, వివిధ అంశాలపై వేగంగా స్పందించాల్సిన అవసరంపై ప్రధాన మంత్రి మాట్లాడారు: ఆక్సిజన్ ఉత్పత్తి పెంపు, పంపిణీ ప్రక్రియ వేగవంతం, ఆరోగ్య సంరక్షణ సదుపాయాలకు ఆక్సిజన్ మద్దతు దిశగా వినూత్న మార్గాన్వేషణ అవశ్యమని ఆయన సూచించారు.

వివిధ రాష్ట్రాల్లో ఆక్సిజన్ డిమాండ్ అంచనా, తదనుగుణంగా తగినంత సరఫరా కోసం ఆయా ప్రభుత్వాల సమన్వయంతో విస్తృత కసరత్తు చేస్తున్నట్లు ప్రధానికి వారు తెలిపారు. దీనివల్ల రాష్ట్రాలకు ఆక్సిజన్ సరఫరా స్థిరంగా పెరుగుతున్నదని వారు ప్రధానికి వివరించారు. ప్రస్తుతం 20 రాష్ట్రాల నుంచి రోజుకు 6,785 మెట్రిక్ టన్నుల వైద్యపరమైన ద్రవీకృత ఆక్సిజన్‌కు డిమాండ్ ఉన్నదని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 21 నుంచి కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు నిత్యం 6,822 మెట్రిక్ టన్నుల వంతున కేటాయిస్తున్నదని వెల్లడించారు. దీనికితోడు ప్రైవేటు, ప్రభుత్వ స్టీలుప్లాంట్లు, పరిశ్రమలు, ప్రాణవాయువు ఉత్పత్తిదారుల సహకారంతో వైద్యపరమైన ద్రవీకృత ఆక్సిజన్ లభ్యతను రోజుకు 3,300 మెట్రిక్ టన్నుల మేర పెంచినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా అత్యవసరంగా ఆక్సిజన్ అవసరం లేని పరిశ్రమలకు సరఫరాను నిషేధించినట్లు తెలిపారు.

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే మంజూరైన 'పీఎస్ఏ' ఆక్సిజన్ ప్లాంట్ల కార్యకలాపాలను వీలైనంత త్వరంగా ప్రారంభించేందుకు రాష్ట్రాలతో సంయుక్తంగా కృషి చేస్తున్నట్లు అధికారులు ప్రధానమంత్రికి తెలిపారు. ఆక్సిజన్ అవసరం ఉన్న వివిధ రాష్ట్రాలకు సజావుగా, కొరతలేకుండా సరఫరా అయ్యే విధంగా చూడాలని ప్రధానమంత్రి అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా అవరోధాలుంటే అక్కడి స్థానిక పాలన యంత్రాంగానికి బాధ్యత అప్పగించాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. ఆక్సిజన్ ఉత్పత్తి, సరఫరా పెంపు దిశగా వినూత్న మార్గాలు అన్వేషించాలని మంత్రులను కూడా ఆయన కోరారు. కాగా, క్రయోజనిక్ ట్యాంకర్ల లభ్యతను వేగంగా పెంచడం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ట్యాంకర్ల దిగుమతి, విమానాల్లో తరలింపు, కొత్తగా ఉత్పత్తిసహా నైట్రోజన్, ఆర్గాన్ ట్యాంకర్ల రూపురేఖలు మార్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

రాష్ట్రాలకు వేగంగా ఆక్సిజన్ రవాణాపై చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ఆక్సిజన్ ట్యాంకర్ల రవణా ఎక్కడా ఆగకుండా, సుదూరానికి చేర్చేవిధంగా రైల్వే సదుపాయాలను ఇప్పటికే వినియోగిస్తుండటంపైనా సమావేశం చర్చించింది. ఈ మేరకు తొలి ట్యాంకర్ల రవాణా రైలు 105 మెట్రిక్ టన్నుల వైద్యపరమైన ద్రవీకృత ఆక్సిజన్ (ఎల్ఎంఓ)తో ముంబై నుంచి విశాఖపట్నం చేరినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు ఆక్సిజన్ సరఫరాలో ఒకదిశ నుంచి సమయం ఆదాకోసం ఖాళీ ట్యాంకర్లను రవాణా విమానాల ద్వారా ఆక్సిజన్ సరఫరాదారులకు చేరవేస్తున్నట్లు చెప్పారు. ఆక్సిజన్ వినియోగం సముచితరీతిలో ఉండేవిధంగా చూడాల్సిన అవసరం గురించి వైద్యరంగ ప్రతినిధులు ప్రస్తావించారు. ఆ మేరకు కొన్ని రాష్ట్రాల్లో తగు తనిఖీలవల్ల రోగులకు ఇబ్బంది వాటిల్లకుండానే ఆక్సిజన్ డిమాండ్ తగ్గిందని వారు గుర్తుచేశారు.

అక్రమ నిల్వదారులపై రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. ఈ సమావేశంలో మంత్రిమండలి కార్యదర్శి, ప్రధాని ముఖ్య కార్యదర్శి, దేశీయాంగ-ఆరోగ్య శాఖల కార్యదర్శులతో పాటు వాణిజ్య-పరిశ్రమల శాఖ, రోడ్డు రవాణా శాఖ, ఔషధ నియంత్రణ శాఖ, నీతి ఆయోగ్ అధికారులు కూడా పాల్గొన్నారు.

# కరోనా ఎఫెక్ట్: జొమాటోలో ఎమర్జెన్సీ ఫీచర్

హైదరాబాద్ ఏప్రిల్ 22: ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ కరోనా టైమ్‌లో ఓ కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది.

ఈ ఫీచర్ యాపిల్, ఆండ్రాయిడ్ వినియోగదారులకు అందుబాటులో ఉండనుంది. కరోనాతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యేకంగా ఈ ఫీచర్ ను అందుబాటులోకి తెచ్చారు. ఫుడ్ ఆర్డర్ చేసేటప్పుడు కొవిడ్-19 ఎమర్జెన్సీగా దానిని మార్క్ చేయవచ్చు. ఇలా మార్క్ చేసిన ఫుడ్ డెలివరీని జొమాటో స్పీడప్ చేస్తుంది. రైడర్ కు సమాచారం ఇచ్చి, నిర్ణీత గడువుకన్నా వేగంగా పార్శిల్ అందేలా చర్యలు తీసుకుంటుంది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.